సుధన్వా సంకీర్తనం



శ్రీమతి బిజిబిళ్ల లక్ష్మీవల్లీదేవి

సుధన్వా సంకీర్తనం - 1

ఆధ్యాత్మిక భక్తి సంకీర్తనలు

ప్రథమ ముద్రణ :

శ్రీ హేమళంబ, జ్యేష్ఠ మాసం, జూన్ 2017

1000 కాపీలు

రచన : శ్రీమతి బిజిబిళ్ళ లక్ష్మీ వల్లీదేవి

మూల్యం - అమూల్యం

సర్వ హక్కులు : బిజిబిళ్ళ ఫౌండేషన్

ప్రాప్తి స్థానం :

Bijibilla Foundation

H.No. 5-208/A, Surabhi Sadan, Lakshmi Vihar,
Phase I , Nallagandla, Seri Lingampally,
Hyderabad- 500019.
Ph : (M) 8886776567

Founders:
Bijibilla Lakshmi Valli Devi,
Bijibilla Rama Rao

Printed at : Sri Perfect Graphics
3-2-693. Beside KVR Diagnostic Centre,
Chappal Bazaar, Kachiguda, Hyderabad.-27

విషయసూచిక

కృష్ణం మధురం..................................

ఉపనయనం	19
కృష్ణహరే	20
కృష్ణం మధురం	21
గోవిందుడే గోవిందుడే	22
దోబూచులాడేవురా	23
పరుగున రారే	24
భవతాపహరణము	25
మా మానసము	26
మాత యశోద	27
వెలుగు వెలుగు	28

తత్వములు 1 ....

అలరాముడైననూ	29
ఇలలోన	30
ఉయ్యాలా! జంపాలా!	31
ఎందుకో నా మనసు	32
కలిమి లేములు	33
కొండచిలువైన	34
నేనెంత అజ్ఞుడను	35
మంచీ చెడులతో	36
మా పదములు	37
వడివడిగా	38
హరి గోవింద	39

తత్వములు 2..................................

ఆత్మకు అంతము లేదన్నా 41

ఎరుగనైతిని 42

చదువులు మెండుగ 43

జనన జీవన 44

జీవాత్మ పరమాత్మ 45

పూవునకు పూదారమునకు 46

బహు జటిలమగు జీవన యాత్రలో 47

వెర్రి యోచనలు 48

శివ గణేశస్తుతి....................................

ఓ బొజ్జ గణపయ్య 49

గం గం గణపతిం 50-51

గరళము 52

గిరిజా రమణ 53-54

చిరు మంద హాసం 55

ధగ ధగ ధగ 56

వినాయకం 57

వినాయకా 58

శివనామస్తుతి 59-60

శివానందచరితం 61

శ్రీ దుర్గాస్తుతి..

అంబవు నీవె 63

అంబా, జగదంబా 64

ఏమని వర్ణింతు	65
ఓ యమ్మ! దుర్గ మాయమ్మ	66
ఘణ ఘణ ఘణ	67
చందనం పూయ రారె	68
జగములనేలే! తల్లివి	69
త్రిభువనపాలిని	70
నవదుర్గవుగారావమ్మా	71-72
పదునారు కళలతో	73
భువనైక జననీ	74
వందనమమ్మా	75
సిరుల నొసగే! శ్రీ గౌరీ!	76
హిమగిరులభాసించు, కాత్యాయనీ	77
శ్రీకృష్ణ గానామృతం.............................	
కృష్ణంవందే జగద్గురుం (భజన)	79
క్షీరాం బుధిలో క్షీరప్రియుండు	80
గోపాలా! శ్రీనందబాలా	81
చిన్ని కృష్ణయ్యా	82
నీ లలిత చరణములు	83
మధురం మధురం	84-85
లాలీ కృష్ణయ్యా	86
వెదురు కొమ్మన సప్త స్వరములు	87
సిరి సిరి మువ్వల కృష్ణయ్యా	88

శ్రీరామాంజనేయం..................

అందాలరాముడు	89
ఓహనుమంతా, అతి బలవంతా!	90
రామ నామ పారాయణము	91
రామం రఘురామం	92
రామనామము	93
వేదాంత వేద్యా	95
శ్రీ ఆంజనేయం అసమాన కాయం	96
శ్రీ ఆంజనేయం (దండకము)	97
శ్రీ సీతారాముల కల్యాణం	98

శ్రీవేంకటేశ్వరం......................

అలరించగ	99
ఆనందం	100
ఇసుమంత	101
ఎరుగ సాధ్యమా	102
కొలచిన వారికి	103
తెనుగునాటను	104
నీ పదముల జేర	105
మాతల్లి అలమేలుమంగ	106
మేలుకో, మేలుకో	107
వేంకటాచల నిలయుడే	108
శ్రీనివాసుడంట	109

శ్రీ శ్రీనివాసం...................

అంబరమందిన	111

ఉయ్యాలా! ఉయ్యాలా!	112
కంటిమి నీదు సుందరరూపము	113
కులుకుల కలికితో	114
కొమ్మల అంచుల	115
జయతు, జయతు	116
తుల తూగేనా	117
పికముల కిలకిల	118
మకుటాయమానం	119
మరుక్షణమున	120
వేదములందును	121
సుప్రభాత వేళలలో	122

సుధన్వా గానామృతం............

గగనము కావల	123
గాలి నీరు ఆకాశము	124
నాధుడె జగన్నాధుడే	125
నానాటికీ ఏనాటికీ	126
పరిపరివిధముల	127
ఫలము పుష్పము, పత్రము,	128
రావా! రావా! కదలి రావా,	129
శ్రీ లక్ష్మి జయలక్ష్మి	130
శ్రీ రంగనాయకి	131
సిరి సిరి మువ్వల	132
హరి నిను తలచగ	133
హలమును చేపట్టె	134

సుధన్వా గీతమాలిక....................

అఖిలాత్మకా	135
ఊయలలూగవయా!	136
కరుణాంతరంగుని	137
మంగళం జయ మంగళం	138
వేడుకలోనూ	139
వ్రేలుపట్టి	140
శ్రీ పాండు రంగం	141
సుదర్శన చక్రమా	142
హరిస్మరణయే	143
హరి నీవే	144
హరినామము	145
ఆలయం	147
కరుణాంబుధివై	148
కొలువగ నితడే	149
జగము నిజము	150
దేవదారుపండు	151
నమో, కేశవాచ్యుతా!	151
భయమేల	152
మంగళమనరే	153
వినతులివె	154
వైకుంఠధాముని	155
సిరిపురవాసినికి	156

సుధన్వా విష్ణుస్తుతి................

అంతయు నీవె	157
అనంతమగు	158
తనకు మారుపేరుగా	159
దూరపు కొండలు	160
నామమాత్రుడ	161
నారాయణా, నారాయణా	162
భావము బాహ్యము	163
మహిమలు తెలుపగ	164
యుగములు మారినను	165
శ్రీ సత్యనారాయణ వ్రతము	166
సూక్ష్మమందునూ	167
అఖిలాత్మకుడు హరి	169-170
అచ్చటిచ్చటలేని	171
అటు నిటు నంతయు	172
ఈజగమువిష్ణుమయము	173
జగమెరిగిన వానికి	174
నారాయణ శ్రీ మన్నారాయణ	175
నీలిమేఘపుఛాయ	176
పురుషోత్తముడు	177
పూజింతురే నిను	178
బ్రహ్మోత్సవం	179
భువినేలే	180

10-04-2016

శ్రీ ఆచార్యఎన్.ఎస్. రాజు
విశ్రాంతఅధ్యక్షులు, తెలుగుశాఖ,
హైదరాబాదు కేంద్రవిశ్వవిద్యాలయం, 297, డోయెన్స్‌కాలని,
శేరిలింగంపల్లి, హైదరాబాదు.

శ్రీమతి బిజిబిళ్ళ లక్ష్మీవల్లీదేవిగారు రచించిన "సుధన్వాసంకీర్తనం" అనే సంపుటి గ్రంథంలో 150 కీర్తనలు ఉన్నాయి. అవి 12 విభాగాలుగా విభక్తమయ్యాయి. ఈ కీర్తనలు భక్తి భావ తన్మయత్వంలో వెలువడిన భక్తి రసగుళికలు. భగవంతుని సుప్రభాతసేవ, పవళింపుసేవ మొదలైన సేవలను కీర్తించినట్లు రచయిత్రి ఈసంపుటిని భగవంతుని ఉపనయనసేవ సంకీర్తనంతో ప్రారంభించి ఒక ప్రత్యేకతను నిలిపారు. శ్రీకృష్ణస్తుతులతో మొదలైన సంకీర్తనలలో క్రమంగా శ్రీరామ, వినాయక, శివ, దుర్గ, ఆంజనేయ, వేంకటెశ్వర, లక్ష్మి, పాండురంగ, శ్రీహరి, సత్యనారాయణ మొదలైన అర్చనారూప దేవతామూర్తుల స్తుతులు ఉన్నాయి. ఈ కీర్తనలలో సగుణ రూప వర్ణనతో పాటుగా నిర్గుణ పరబ్రహ్మమును కూడా వర్ణించడం రచయిత్రి ఆధ్యాత్మిక పరిణతికి నిదర్శనం. కీర్తనలు చిన్న చిన్న పదాలతో సరళమైన కూర్పుతో సహజమైన రచనగా ఒప్పుతున్నాయి. ఈ సంకీర్తనలు అనుప్రాసలు, పద-అక్షరఆవృత్తులతోను, ఆది-అంత్యప్రాసలతోను అప్రయత్నమాత్రాఛందస్సుతోను, కూడి శ్రావ్యతాగుణంతో భాసిస్తున్నాయి. భావరమణీయంతో పాటు శాబ్దిక రమణీయం కూడా చాలా కీర్తనలలో కనబడుతుంది.

"కృష్ణం మధురం నీజననం
బాలకృష్ణం సతతం నీస్మరణం"

మొదలైన పల్లవులు జయదేవుని గీతగోవిందాన్ని స్మరణకు తెస్తున్నాయి.

"దోబూచులాడేవురా కృష్ణయ్యా!
బూచులుదునిమేటి అల్లరికన్నయ్యా!"

"శకటాసురుని దన్నిన పాదములు
నొప్పిగొనినవా! చక్కనిస్వామీ!
పూతన ప్రాణము హరియించిన
నీ నోరు నొప్పిగొనినదా స్వామి"

మొదలైన గేయపంక్తులు భక్తిభావాన్ని ఆలంకారికంగా ప్రకటించడాన్ని వెల్లడిచేస్తున్నాయి. "అలరాముడైననూ" (27)"ఇలలోన" (29)వంటి కీర్తనలు దీనికి మరికొన్ని నిదర్శనలు.

నిర్గుణపర బ్రహ్మమును కాంతి స్వరూపంగా సంభావించడాన్ని "ఈ లోకమంత వెలుగు-మన శోకమంత తొలగు" వంటి పాదాలలో రచయిత్రి ప్రకటించడం వారి తాత్విక భావసంపదకు ఉదాహరణం.

"ఆటపాటలజోల ... విద్యార్జన హేల ...
వయసుడిగినవేళ ...వేదాంత ఊయల ...." వంటి పాదాలు అంత్యప్రాసకు,
"ముద్దులకృష్ణుడె.......ముత్యపుటుంగరముల...........,
పరమాత్ముడు.............. పరముతానై....... ......" వంటి పాదాలు
ఆద్యక్షరావృత్తికి నిదర్శనలు. "చెరసాలలో జరిగెను జననం,
చెలువిడిపించు నీచరణం (17) వంటిపాదాలు ఆదిప్రాసకు నిదర్శనలు.
ఇలా చాలా కీర్తనలు కవితా సౌందర్యాన్ని కూడాప్రకటిస్తున్నాయి.

ఈ విధంగా వీరిసంకీర్తనల సంపుటి నుంచి ఎన్నివిశేషాలనైనా చూపవచ్చు. గీతా మాధుర్యానికి గనివంటి" సుధన్వా సంకీర్తనల" సంపుటి ద్వారా రచయిత్రి మరొక మీరా బాయిగా వాసికెక్కగలరని విశ్వసిస్తూ వారికి సర్వమంగళములు కలుగ జేయవలసిందిగా భగవంతుని ప్రార్థిస్తున్నాను.

శుభం.

నడుపల్లిశ్రీరామరాజు

"కవిరాజు, సాహితీ యువరత్న" డా. కావూరి శ్రీనివాస్
నంది అవార్డు గ్రహీత, కవి, శాసన తాళపత్ర గ్రంధ పరిశోధకుడు
మరియు పరిశోధన అధికారి, తెలంగాణా పర్యాటక శాఖ,
(బుద్ధవనం) ,హైదరాబాద్

వాగ్దేవినమహః నమః శ్రీ శారదా ఓం

భక్తి నివేదన

అమ్మగారు శ్రీమతి బి.లక్ష్మివల్లీదేవి గారి హస్తాక్షర సుమధుర సుమనోహర "సుధన్వాసంకీర్తనామృతం" భక్తిత్వానికి- ముక్తిత్వానికి ఇది ఎంతోవిలువైన సంకీర్తనల సంపుటి. ఇందులో ఆధ్యాత్మిక-భక్తి-తత్వ గేయములు విపులంగా విశదీకరించి వ్రాసినారు. ఈ మన భారతావనిలో ఎందరో మహానుభావులు రచించిన సంకీర్తనలను, తత్వములను, రగడలను, స్తోత్రములను, దండకములను, గేయములను (పాటలను) ఇంకా ఇతరత్రా ఎన్నో భక్తికి సంభందించినవి ఉన్నాయి. అయితే కొందరు మాత్రమే వెలుగులోకి వచ్చారు. మరి కొందరు చరిత్ర గర్భంలోనే మిగిలిపోయారు. వారిలో, 13వశతాబ్దము నాటి షడాక్షరస్వామి, 14, 15 శతాబ్దములనాటి కృష్ణమాచార్యులు ఇలా ఎందరో, అయితే ఒక్కొకరూ ఒకొక్క ఒరవడిని సృష్టించారు.

అమ్మగారు వ్రాసిన ఈ సంకీర్తనల్లో అన్నీ మృదు మధురంగానే ఉన్నాయి అనుటలో ఏ మాత్రం కించిత్ సందేహములేదు. భక్తులు, అశేష ప్రజానీకం ఆదరించి, ఈ సంకీర్తనలను భక్తితో చదివి ధన్యులౌతారని నా ప్రగాఢ విశ్వాసం. ఇందులో, మృదు మధ్యాక్కర-మాత్రా-అలంకార భావాలతో కూడుకున్న భక్తి సంకీర్తనలు ఇవి. ఒకచోట అమ్మగారు ఇలా అంటారు చూడండి.

"అంబా, జగదంబా" గేయంలో చివరి చరణంలో

"చరణం": అష్ట దిక్కులు పాలించే పరమేశ్వరి - పరమ పావని (2)
దుష్ట సంహారిణి, దురిత విమోచని నీవు అంబా, జగదంబా "అంబా" (2)
ఇటువంటివి ఎన్నో ఉన్నాయి.

తల్లులగన్న తల్లి మహాతల్లి చతుర్దశ భువనాల శక్తి స్వరూపిణి నా తల్లి దయ ఈ తల్లిపై దండిగా ఉండాలని మరెన్నో మహోన్నత సంకీర్తనలను వ్రాయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ!!!

"శుభంభూయాత్" - శ్రేయోస్తుతేసదా!!!

డా. కావూరి శ్రీనివాస్

ఓం శ్రీసాయిరాం

05-04-2016

ఆచార్య పోతుకూచి ఉమాభట్టీశ్వరశర్మ,
ఎంఏ, ఎంఫిల్, పిహెచ్.డి.
అతిథిఆచార్యులు, హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

“భక్తిరేవగరీయసీ”అన్నారు ప్రాజ్ఞులు. భగవంతుని కంటె భగవద్భక్తులే శ్రేష్టులని నిరూపింపబడిన ఘట్టాలకు మనపురాణాలలో కొదువలేదు. భగవంతుడు భగవద్భక్తుల సంకీర్తనలలో కొలువై ఉంటాడని నారద ఉవాచ. ఈ అన్ని విషయాలనూ ఆకళింపు చేసుకొన్న మహిళామణి శ్రీమతి బిజిబిళ్ళ లక్ష్మీవల్లీదేవి గారని నా అభిప్రాయము. కాబట్టే త్యాగయ్య, అన్నమయ్య, పురందరదాసు, రామదాసువంటి భక్తశిఖామణుల సంకీర్తనలకే మాత్రము తీసిపోని విధంగా తమ “సుధన్వా సంకీర్తనం” రచనాగ్రంధము సాగించారనటం ఏమాత్రం అతిశయోక్తి కాదేమో. ప్రతికీర్తన ఒక రసగుళిక. నా పూర్వజన్మ పుణ్యఫలాన నేను ప్రస్తుత కవయిత్రి తండ్రిగారైన “బ్రహ్మశ్రీ రావిపాటి బాలగురునాధ శర్మగారి” కొన్ని పారమార్ధిక వ్యాసాలను చదవటం తటస్థించింది. అలాంటి మహనీయుని పుత్రికకు భక్తిరస భావ బంధురమైన కవిత ప్రాప్తించటం ఆశ్చర్యమేమీకాదు. పైగా అది సహజం కూడా.

“సుధన్వాసంకీర్తనం” - అనే ఈమధుర భక్తిరసకావ్యం మధురాతి మధురమైన కీర్తనలతో నిండి ఉంది. ”పోతన్న తెల్గుల పుణ్యాపేటి” అని విశ్వనాథ సత్యనారాయణ గారు పోతన కవిత్వాన్ని మెచ్చుకొన్నారు. శ్రీమతి లక్ష్మీవల్లీదేవిగారు కూడా పోతన మహాకవికి ఏమాత్రం తీసిపోని విధంగా భక్తిరసమాధుర్యంతో తమ సంకీర్తనలను నింపివేశారు. వారికి నా మనఃపూర్వక శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను.

భవదీయుడు

డా.పోతుకూచిఉమాభట్టీశ్వరశర్మ
ఫోన్- 8186818811

అభినందనలు

ప్రియమైన సోదరి శ్రీమతి లక్ష్మీవల్లీదేవికి

మీ సోదరుడు సుబ్రమణ్యశర్మ శుభాభినందనలతో వ్యక్తపరుస్తున్న విషయములు.

మీరు ఎంతో భక్తి శ్రద్ధలతో పంపిన "సుధన్వాసంకీర్తనం" రచనా గ్రంధము అందినదని తెలియపరచుటకు సంతోషిస్తున్నాను. ఆ భగవంతునిపై రచించిన కీర్తనలు ఎంతో శ్రద్ధతో చేసారు. సదా భగవదాను గ్రహం కలుగుగాక. అన్ని జన్మలలో మానవ జన్మ చాల అత్యుత్తమమైనదని, అట్టి మానవులు సదా భగవంతుని స్మరిస్తూ మరో జన్మ లేనివారిగా మోక్ష ప్రాప్తి పొందటానికి ప్రయత్నించాలని భగవద్గీత విశదీకరిస్తున్నది.

ప్రతి మానవడు నవవిధభక్తి విధానముల ద్వారా భగవంతుని చేరవచ్చుని గీతోపదేశం చేస్తున్నది. మీరు రచించిన ఈ సంకీర్తనలలో ప్రతిఅక్షరము, పదము మరియు వాక్యము భగవంతుని స్మరిస్తూ అత్యున్నతమైన మోక్ష మార్గమును సూచిస్తున్నాయి అనుటలో ఏ మాత్రం సందేహము లేదు. ఈ భగవన్నామస్మరణ తత్వము ఎన్నో జన్మల పుణ్యఫలము మరియు సత్కార్యముల చేతనే లభిస్తుంది. ఈ సంకీర్తనలు ఎంతో ముదు మధురంగాను, ఆహ్లాదకరం గాను మనస్సుకి సంతృప్తినిచ్చేవిగాను ఉన్నాయి. మీరు రచించిన ఈ రచనా గ్రంధము భావితరాలకు ఎంతో ఉపయోగ కరము మరియు ఆదర్శప్రాయంగా నిలుస్తుందనటంలో ఎటువంటి సందేహములేదు. కేవలం ఒక్కభగవంతుని స్మరణ మార్గము ద్వారా మాత్రమే జన్మబంధముల నుండి విముక్తిపొందుతారని, భగహదానుగ్రహము కంటేమనిషికి ఇంక ఏమికావాలి? ఇన్నివందల కీర్తనలు రచించిన మీకు ఆ భగహదానుగ్రహం తప్పక లభిస్తుందని నా ప్రగాఢ విశ్వాసం. భగవంతుని స్మరణకు మించినది ఈ ప్రపంచములో మరొకటిలేదు. మీ సంకీర్తనల ద్వారా ప్రజలందరిని చైతన్యపరచి దైవస్మరణ చేయిస్తున్న మీకు ఆ భగవంతుడు నిరంతరం ఆశీర్వదించుగాక!

రావిపాటిసుబ్రమణ్యశర్మ,

ఆఫీసర్, ఆంధ్రాబ్యాంక్(రిటైర్డు)

స్వీయ పరిచయం

“గరిక పూవునకు స్సుగంధ పరిమళమబ్బెన్” అన్న రీతిగా ఆ పరంధాముడు సామాన్య గృహిణి ఐన నాకు ఇంతటి వరం ప్రసాదించాడు. ఆయనకు నేను ఏవిధముగా కృతజ్ఞతలు తెలుపగలను? నాపేరు లక్ష్మీవల్లీదేవి. నాకు జన్మ నిచ్చిన మాతాపితరులు త్రిపురసుందరీదేవి, బాల గురునాధ శర్మ గార్లు. మా తల్లిదండ్రులు మమ్ములను ఎంతో బాధ్యతాయుతంగా మితభాషులుగా పెంచినారు.

పూర్వము మధ్యతరగతి కుటుంబములనిన అందరికీ తెలిసిన విషయమే! మేము ఏడుగురు సంతానం. అందరూ సరస్వతీ పుత్రులే. కాలానుగుణంగా వారి వారి ఉద్యోగములలో స్థిరపడినారు. మా స్వగ్రామం నరసరావుపేట. గత 40 సంవత్సరములుగా భాగ్యనగరములోనే స్థిరపడినాము. మా శ్రీవారి పేరు బిజిబిళ్ళ రామారావు గారు. ఆయన ఇక్రిసాట్ లో 15 సంవత్సరములు ఫైనాన్స్ విభాగములో పనిచేసారు. ఆ తరువాత భారతీయ జీవిత భీమా సంస్థలో గత 15 సంవత్సరములుగా ఫ్రీలాన్సర్ గా పనిచేస్తున్నారు. మాకు ముగ్గురు సంతానం. వివాహానంతరం ముగ్గురు అమ్మాయిలు వారి కుటుంబ సభ్యులతో కలసివుంటున్నారు.

నేను ఆ పరంధాముడి దయతో నా గేయరచన ప్రారంభించాను. ఒకనాడు నా “మనసులో” నేను ఏదైనా గేయం రాయగలనా! అని అనిపించింది. అపుడు నేను “శ్రీ మహావిష్ణువు” పైన వ్రాయనారంభించాను. ఆ రోజు ప్రారంభించిన నేను ఆ దేవుని దయతో నా గేయ రచనా ప్రవాహానికి అడ్డుకట్ట వేయలేదు. నాకు తెలిసిన కొద్దిపాటి జ్ఞానంతో, దేవుని తత్వంతో ఈనాటి వరకు కొనసాగించాను. ఆ నారాయణుడి దయలేనిదే నేను నా రచనా ప్రయాణాన్ని కొనసాగించలేను. నా ఆలోచనా పరంపరని ఒక క్రమపద్ధతిలో వ్రాయడం మొదలుపెట్టాను.

భగవంతుని తత్వం తెలుసుకొనుట అనునది అంత సామాన్య విషయంకాదు. దానికి హద్దులు లేవు. స్థితికారుడు అయిన ఆ విష్ణువు గూర్చి మనం తెలుసుకోగలమా! భగవంతునిపై నాకు కలిగిన, ఆయన కలిగించిన భావములను మరల ఆయనకే అప్పజెప్పాను. అంతే! కానీ నామనసు ఒక అనిర్వచనీయమైన ఆనందానికి లోనయింది. ఆ పరమాత్మని అపారమైన కరుణా దృష్టితోనే నేను యీగేయములను వ్రాయగలిగాను. ఆయనకు నాశతకోటి వందనములు.

మా శ్రీవారు నాకు ఎనలేని స్పూర్తినందించారు. ఆయన నాకు అడుగడుగున సహాయ సహకారములందించారు. నా ఈ రచన కార్యరూపం దాల్చటానికీ అయన కించిత్ కూడా అలోచించలేదు. ఈ గేయములను పుస్తక రూపములో ముద్రించడానికి, సిడి రూపంలో పదిమందికి అందించటానికి అసలు వెనుకంజవేయలేదు. ఒక సంగీత దర్శకుడిని కలసి కంపోజ్ చేయించాము. మా పిల్లలు గూడా మాకు ఎంతో తోడుగా నిలిచారు. నాయీకొద్దిపాటి ప్రయత్నాన్ని అందరూ అదరిస్తారనీ అశిస్తున్నాను. ఏమైనా తప్పులువుంటే పెద్దమనసుతో నన్ను క్షమించగలరు.

బిజిబిళ్ళ లక్ష్మీవల్లీదేవి

ఉపనయనం

పల్లవి : ఉపనయనం, ఉపనయనం "2"

అ.ప : జగమేలు స్వామికి, యజ్ఞోపవీతధారణం "ఉప"

చరణం : జగములనొక త్రాటిపై, నడిపించే స్వామికి "2"
ముద్దులొలుకు మూడుప్రోగుల యజ్ఞోపవీతం
చతుష్షష్టి కళలతో తులతూగు స్వామికి
షోడసకళలతో,కళలొలికే స్వామికి "ఉప"

చరణం : ద్వారకావిభునకు, స్వర్గద్వారముల సులభునకు
ముల్లోకములేలు స్వామికి, ముచ్చటైన యజ్ఞోపవీతం
జగన్నాటక సూత్రధారికి, జయ జయ ధ్వానముతో "2"
మురిపించు మూడు ప్రోగుల, యజ్ఞోపవీతం "ఉప"

కృష్ణ హరే

పల్లవి : కృష్ణ హరే! జయ కృష్ణ హరే! "2"
గోపవనితల నిశ్చలభక్తికి, కృష్ణ హరే!
జయకృష్ణ హరే "2"

చరణం : బృందావనమున, గోపాలబాలునితో
వేణుగాన రసడోలల, గోపవనితలు, ఆడిపాడిరి
"నల్లనయ్య" అను పిలుపే నలు దిక్కుల
మారు మ్రోగె, పల్లె పల్లెల, రేపల్లెల "2"
పున్నాగ వనమున, పున్నమి వెన్నెలలో
గోపెమ్మ గన్నుల, నంద గోపాలుడే "కృష్ణహరే"

చరణం : అల గోపెమ్మల, పాద ధూళియే కడకు
మేటి ఔషధమాయె, ద్వారకా విభునకు
చిన్ని బాలుడాయె, కృష్ణుడు, ఆడి పాడెను
గోపకాంతలంత గూడెను, పరవశించెను "2"
మురిపించె నందనుడు, వేణుగాన డోలల
బృందావనాన సంబరాల అంబరమంటెనులే "కృష్ణ హరే"

కృష్ణంమధురం

పల్లవి : కృష్ణం, మధురం, నీ జననం
బాల కృష్ణం, సతతం నీ స్మరణం

అ.ప : మధురా నగరిలో నీ జననం "2"
అఖిల లోకములకు పరమానందం "కృష్ణం"

చరణం : చెఱసాలలో జరిగెను జననం
చెఱ విడిపించు నీచరణం "2"
వ్రేపల్లెలో నీ పాలనము"2"
గోకులమూ, పరమ పావనము "కృష్ణం"

చరణం : దుష్టుల పాశము, నీ తీక్షణము
శిష్టుల రక్షణయే లక్షణము "2"
అష్ట దిక్కులలోఎటు వీక్షించిన"2"
కటాక్షము నొసగే కైవల్యుడితడే "కృష్ణం"

గోవిందుడే గోవిందుడే

పల్లవి : గోవిందుడే,గోవిందుడే
ఈతడె, మాపాలి గోపాలుడే "2"

అ.ప. : గోవులను కాచేటి గోవిందుడే హై "2"
గోవర్ధనమును ఎత్తెనులే "గోవిందుడే"

చరణం : బృందావనమున గోవిందుడే
గానామృతముల గానలోలుడే "2'
రాధాలోలుడె గోవిందుడే హై "2"
మా బాధలనే త్రోలెనులే గోవిందుడే "గోవిందుడే"

చరణం : ముద్దుల కృష్ణుడె గోవిందుడే
ముత్యపు టుంగరముల నందబాలుడె "2"
పరమాత్ముడు వాడె గోవిందుడె హై "2"
పరముతానై వున్నాడు, గోపాలుడే "గోవిందుడే"

చరణం : వెదురునందున గోవిందుడే
మధుర రవళులు, మ్రోగించెనులే "2"
వెతలను బాపును గోవిందుడే హై "2"
వేదాంతసారము గోపాలుడే "గోవిందుడే "

దోబూచులాడేవురా

పల్లవి : దోబూచులాడేవురా, కృష్ణయ్యా "2"
బూచులు దునిమేటి అల్లరి కన్నయ్యా "దోబూచు" "2"

చరణం : దాచిన వెన్నను దొంగిలించి
నీ సాటి బాలురతో భుజియించేవు "2"
బృందావనమున నీ అడుగుల సవ్వడితో"2"
తరులు, విరులు ఆనంద నాట్యమే "దోబూచు" "2"

చరణం : అన్నికాలముల, అఖిల ధర్మములు
నడుపుటకు నీవు అవతరింతువు
మేటి నీవయా! నీ సాటి ఎవరయా! "2"
ఇలను మహిమలు చూపించ రావయా! "దోబూచు"

పరుగున రారే

పల్లవి : పరుగున రారే, ఇంతులాలా
పసి బాలుని జూడగ, ఇంతులాలా "2"

అ.ప : పరిచయము తోనే ఇంతులాలా "2"
పరమొసగే స్వామిని, ఇంతులాలా (పరుగున)

చరణం : యశోద కన్నడే, ఇంతులాలా
మనకు యశముల నిచ్చేనే, ఇంతులాలా "2"
భుజగ శయనుడే, ఇంతులాలా "2"
మనల భుజములపై, మ్రోయునే ఇంతులాలా (పరుగున)

చరణం : శక్తి, యుక్తులను, ఇంతులాలా
శ్రమ లేక ఇచ్చునే, ఇంతులాలా "2"
శరణను వారిని, ఇంతులాలా "2"
శరవేగమున గాచును, ఇంతులాలా (పరుగున)

చరణం : అణువంతేనే, ఇంతులాలా
పలురూపముల, దోచునే, ఇంతులాలా "2"
పరికించి చూడంగ ఇంతులాలా "2"
బ్రహ్మాండ మాతడే, ఇంతులాలా (పరుగున)

భవతాపహరణము

పల్లవి : భవతాపహరణము, నీ పాదకమలము "2"
గోశాలలో నీ నామకరణము "భవ"

చరణం : జగన్నాయకుని, తన జఠరమున మోసి
ముక్తి బడసినది, దేవకీ దేవి "2"
ముద్దుల కృష్ణుని ముద్దు ముచ్చటల పాలించి "2"
మదిన మురిసినది, యశోదమ్మ "భవ"

చరణం : దైత్యుల, మర్ధింప, నంద గోకులమున
పసి బాలునిగా, రూపు దాల్చినావు "2"
అల్లరి కృష్ణునిగా, వలువలను దాచితివి "2"
వైరాగ్య యోగము నీవు తెలిపితివి"భవ"

మామానసము

పల్లవి: మామానసము, బృందావనము
మాపాలకుడు, ఆ గోపాలుడే "2"

చరణం: మానస తోటలో కల్మషమను కలుపును
తొలగించు మానస చోరుడు
బేధములు మాపి, భావము తోడనే
బంధములు పెనవేయు భాగవతోత్తముడు
మంచి మనసులను, విత్తనములను నాటి
గెలచి, నిలచినవాడు, గోకులనందనుడు, గోవిందుడు "మా"

చరణం: బేధ భావమ్ములు విడనాడేనట
ఒక త్రాటిన చేర్చిన మహీపాలుడు
భవ బంధమ్ములు విడిపించేనట
అవతారమూర్తీ, ఘనతార కీర్తీ
బేధరహితుడు, భూతభావనుడు వాడు
గరుడారూఢు, ఘనశ్యాముడు,
గోవిందుడు గోపాలుడే "మా"

మాతయశోద

పల్లవి: మాతయశోద, ముద్దుల బిడ్డడు
మాయాసురులను, దునుమక మరలడు "2"

అ.ప: దుష్టులపాలి సింహస్వప్నము
శిష్టుల కన్నుల పున్నమి చంద్రము "మాత"

చరణం: శకటాసురుని దన్నిన పదములు
నొప్పిగొనినవా! చక్కని స్వామీ
పూతన, ప్రాణములు హరియించిన
నీనోరు, నొప్పిగొనినదా! స్వామి
నవనీతము, నోరార భుజియించి
సేద తీరుమా! పన్నగ శయనా"2"
దుష్ట కంసుని హత మార్చిన
నీ చిన్ని కరములు కందినవా!?
దీనుల కభయము లీయగ, కరములు
కల్యాణ కారకమవునుగా "మాత"

చరణం: యశోదమ్మ నిను రోటను గట్టగ
నడుము మిగులగ, నొచ్చినదా! స్వామి!
కుబేర పుత్రులు, వృక్షరూపుల
శాపము బాపిన పురుష పుంగవా! "స్వామీ"
ముల్లోకములూ పాలించెడివాడు
వైకుంఠుని సరిదైవమె లేదు "2"
అల దైవముకును, యిల సైతం, మరి,
భాదలు, గాథలు తప్పినవా!?
అయిన నాతడు, చలించక జగతిని
రక్షించి, కాపాడునుగా! "మాత"

వెలుగు వెలుగు

పల్లవి : వెలుగు వెలుగు వెలుగు

ఆకాశమంత వెలుగు "2"

అ.ప : జిలుగు జిలుగు జిలుగు

తన మేని రంగు జిలుగు

చరణం : ఈ లోకమంత వెలుగు

మన శోకమంత తొలగు

ముత్యాలసంపద మన చేరువనే దొరకు

ముక్తిసంపద, మన ముంగిటనే దొరకు "వెలుగు"

చరణం : ఆకస మందున చుక్కల వెలుగు

చుక్కల నడుమ, బహు చక్కని స్వామి

కాళీయమర్దుని కాంతుల వెలుగులో

తనువు పరవశించు, మన మనసు పులకరించు

మానస వీధిలో విహరించే స్వామి

మన మానస వీధిలో విహరించే స్వామి "వెలుగు"

అలరాముడైనను

పల్లవి : అలరాముడైనను, సరి బాలుడైనను
అమ్మ ఒడిలో హాయిగా నిదురబోవు

అ.ప : అల దైవమైనను, ఇల మనుజుడైనను
ఎంత ఎదిగినను, పసిబాలుడే తాను
జో జోజో "2" "అల"

చరణం : పుడమి అయినను, స్వర్ణవూయలే ఐనను
పసిపాపలు, నిదురలో పరవశింతురు
మహరాణికైనను, సామాన్య వతికైన
కన్న ప్రేమకు కొదవె వుండదు "అల"

చరణం : కడుపేదకైన, ధనభూపతికి ఐనను
వాత్సల్యమునకు వారధి వుండదు "2"
జున్నుపాలైననూ, కటిక నీరైననూ
ఆకలికి బేధమసలుండదు "అల"

చరణం : సురపతులే ఐన, దైత్యులే ఐన
అధికులే మరి హీనులే ఐన
అవ్యాజ కరుణను జూపుటలో
జగమందు స్వామికి, సరిజోడి కనము "అల"
"జో అచ్యుతానంద! జోజో ముకుందా!
లాలిపరమానంద, రామ గోవిందా! జో,జో!"

ఇలలోన

పల్లవి : ఇలలోన, స్వర్గ, సుఖములు ఎదురైన
మదిలోన విడువక, నిన్ను నమ్మితి "2"

అ.ప : ముజ్జగమ్ముల ఏలిక, నీవంటునమ్మితి దేవరా "2"
నిన్నేనానెర నమ్మితి, హరీ "ఇలలోన"

చరణం : మోక్షమును కోర, కాంక్షయె లేదు
ముమ్మారు, నీ నామమె నమ్మితి
భవపాశమ్ములు, నన్ను, మరి, పెనవేసిన
నీదరినిజేరుట, గతియని నేనమ్మితి "ఇలలోన"

చరణం : పలుకుటే ఎరుగని, మూగ జీవులు
నిరతము నిన్నే మనమున ధ్యానించును
మాటలను, బింకమును, నేర్చిన వాడను
నిన్నేల, స్మరియింపగ, మరచెద నేను "ఇలలోన"

ఉయ్యాలా! జంపాలా!

పల్లవి : ఉయ్యాలా! జంపాలా!

నట్టనడిమినది, సుఖఃదుఖముల డోల "ఉయ్యాలా"

చరణం : పసిప్రాయమందున, ఆటపాటల జోల

యవ్వనప్రాయమున, విద్యార్జనహేల "2"

వయసుడికిన వేళ, వేదాంత వూయల

మధ్యననున్నది, జీవనహేల "ఉయ్యాలా"

చరణం : సత్సంగ సాంగత్యం, జ్ఞానమునకు వూయల

గ్రంధ పఠనమే, విజ్ఞాన వూయల "2"

ఉపకారమనునది, నిస్సందేహ వూయల

అపకారికైనను, ఉపకార వూయల "ఉయ్యాలా"

చరణం : అస్సాధ్యమైనను, సాధన వూయల

అణువంతైనను, సంతృప్తి వూయల

ఇసుమంతైనను, కొండంత వూయల

గోవిందునిసేవే, ఆనంద డోలల "ఉయ్యాలా"

ఎందుకో నా మనసు

పల్లవి : ఎందుకో నా మనసు, ఎదురు సూస్తున్నాది
ఎల్లలేలేనిసామి, ఎదురుగ వత్తాడని "2"
హైలెస్సో, హైలెస్సా "ఎందుకో" "2"

చరణం: సెట్టు, సేమలు అన్నీ, ఎదురు తెన్నులు కాసే
సేతితో నా సామి, తాకగ మురిసేను "2"
నోరులేని జీవులన్నీ, కల్కు ఇల్లు సేసుకొని "2"
సామిరాక కోసమే, ఎదురు సూత్తున్నవి
హైలెస్సో, హైలెస్సా "ఎందుకో" "2"

చరణం: ఏటిలోని సేపలన్ని, నీరుగారి పోయినవి
నీరాక కోసమై, సిక్కవు వలలోన "2"
కొండలన్నీ, నీ రాకకై బండ బారి పోయినవి "2"
నీ రూపు దాల్చుటకూ, నీ సేవ సేయ
హైలెస్సో, హైలెస్సా "ఎందుకో" "2"

చరణం: మణిసై పుట్టినాను, నీ సేవ కోసమే
నిన్నేల మరిసేనూ, నీ కై మసలేను "2"
నాసామి, నీకేమి, బదులుగ యిచ్చేను
నామనసు నీకెపుడో, నైవేద్ద మాయెను హైలెస్సో, "2"

కలిమి లేములు

పల్లవి : కలిమిలేములు, సమమని భావించి "2"
ఇలనుమనిన, ఆనరుడే, మహనీయుడు "2"

చరణం : పురుషాధముడవని, భావించిన నిన్నే "2"
పురుషాగ్రశ్రేణివని, పొగడుదురె! జనులు "2"
కలిమిలేములను, త్రాసున నిలబెట్టి "2"
కొలచి, కొలచి, వేధింతురయ్యా నిన్నే!
ఈ నరులు, యిల నరులు "కలిమి"

చరణం : కలిమియందునను, కలదంటు సుఖము
తలచిన వారంతా, మరలెదరు, దిక్కును "2"
కలిమిలేములు, దేవుని చేతలని "2"
తెలియనివారె చేసెదరయ్యా మాయను
ఈనరులు, యిల నరులు "కలిమి"

చరణం : కలిమిలేములే, వెలుగుతిమిరముల "2"
జోడియని, నమ్మే, మనుజులె నిక్కము "2"
లేమియందుననూ, తనవారిగ తలచుకొని "2"
మెలగిన వారే, జగమున నిజమగు బంధము 'కలిమి'

చరణం : ఇహమున, నిజకలిమి పద్మనాభుడని "2"
ఎరుగనివారేలే, కడలేని లేమియని
ఎరిగిన ఆనాడు, పరమగును, యిహము "2"
ఎరుగనినాడు, కనలేము, యిల పరము 'కలిమి'

కొండచిలువైన

పల్లవి : కొండ చిలువైన గాని, చిన్నచీమైన గాని
రమ్యునిప్రసాదమే, తరచి కానగ "కొండ" "2"

చరణం : బహు ఘన వృక్షమైన చిన్నినాటైననూ "2"
తరచి చూచినది, శ్రీ హరి ప్రసాదమే "2"
పర్వత రాజమైన, భువిపై, రజమైన "2"
యోచించగా నదియు, సిరివరుని ప్రసాదమే "కొండ"

చరణం : కొదమ సింగమైన, చిన్ని చేపైనను
తర్కించగ నదియు, సర్వేశ్వర ప్రసాదమే
సర్వసృష్టి కంతయు నిశ్చల మనస్కుడే "2"
వైకుంఠ నిలయుడే నిజమైన దైవము "కొండ"

నేనెంత అజ్ఞుడను

పల్లవి: నేనెంత అజ్ఞుడను? నీయునికి వెదుక "2"

అ.ప. : అంతటా నీవె, నిండియుండినస్వామి (నేనెంత)

చరణం: అణువణువూ నీవె, పరమాణువు నీవె
గిరులు, తరులు, పూవనముల నీవె "2"
పూలను దాగిన మక రందము నీవె
అద్భుతము, నీజేత! వచియింపగ స్వామి "2" (నేనెంత)

చరణం : జలపాతముల నీవె, జలమున నీవె
జల చరముల నీవె, చరాచరము నీవె "2"
పిన పాపలలోని, ముసినవ్వులు నీవె
ఊయలలూగేవు, తల్లిలాలిలో నీవె (నేనెంత)

చరణం : పిల్ల తెమ్మెరలు, పెనుగాలుల నీవె
పూబాలలో, శిరసూయల నీవె "2"
హిమ బిందువు నీవె, బడ బాగ్నియు నీవె
నాలోని నిన్ను, నలుదిశల వెదకేటి (నేనెంత)

మంచీ చెడులతో

పల్లవి : మంచీ చెడులతో, మనును జీవనము
కాలగమనమున, అవియును మారేను

అ.ప : హరి తలపే, మన నిజమగు ధనము
ఎంత తలచిన అది, అంత పెరిగేను (మంచీ)

చరణం : కన నీకు మిగుల మంచి యనునది
చేదుగ దోచేను, అదియే నాకు
పలువురకు మేలు సేయునన్నదే
మంచియని తోచవలె, నీకును, నాకును
మంచీ చెడుల తర్కము వ్యర్థము
కాలసమయములు, మరలుట కష్టము
అల మాధవుని, సేవించుటనున్న, సుఖము
అన్నిటను, మించినది ఓరన్న (మంచీ)

చరణం : కాలమాన స్థితిగతులు మారినను
మంచియె నిలచును, కలకాలము
మహిమలు ఎన్నో, సృష్టి చేతలో
నగధరుని స్మరణే నిలువగ మనలో
మంచీ చెడుల, వివరణ కష్టము
అచ్యుతసేవనమే, సులభ మార్గము
ఏలచింత యిలలోన ఇక మనకు
కొలచిన మేలగు ఓరన్నా (మంచీ)

మా పదములు

పల్లవి : మా పదములు, మా పలుకులు

నీ వరకే, నీ కొరకే "2"

అ.ప : మాగమనము, మాగమ్యము

నీవరకే, చేరువకే "మాపదములు"

చరణం: మా చలనము, చేతనము

నీ కొరకే, నీవరకే "2"

మా ఆరంభం, అంతిమము

నీ వరకే, చేరువకే "మా పదములు"

చరణం: మా స్పందన, బంధనము

నీ కొరకే, నీ వరకే "2"

మా జీవనము, జీవితము

నీ కొరకే నీవరకే "మా పదములు" "2"

చరణం : మా భావన, ప్రేరణమూ

నీకొరకే, నీవరకే "2"

నీఆదరము, సాదరము

కావవి, మితమనంతము "మా పదములు" "2"

వడివడిగా

పల్లవి : వడివడిగా, అడుగులు పడిననూ

పొగడుచు, నామది, హరినిన్నేతలచును "వడివడిగా"

చరణం : మనమున నిన్నే, నమ్మితిని

ఎదలో నిన్నే, కొలువుంచితిని "2"

సురలు, యోగులు, మునులు, ఎల్లరును "2"

భావమ్ముల నిను, సాధింతురుగా "వడివడిగా"

చరణం: సత్యము ఎచ్చట, స్థిరముండునో

ధర్మము ఎక్కడ, ఆదరింతురో "2"

అచ్చట, అన్వేషకుల ఎదలను "2"

ఒక ఘడియైన, విడువక తిరముండేవు "వడివడిగా"

హరి గోవింద

పల్లవి : హరిగోవింద, గోవింద
భజ గోవింద, గోవింద "2"

చరణం : వనరాజైన, మృగ రాజైనను
ఆకలి గొనినంత, కోరునాహారము "2"
మరి, మానవులు, "తృష్ణ" యను నాకలి
కలుగ, లోకమునే భుజియింతురే! (హరి)

చరణం : కాలకూటమగు విషమును జిమ్మెడు
కాలనాగైనను, గళమున మెరిసెనే "2"
మనుజులేల మెలుగక శాంతము "2"
క్రోధమను విషమును గ్రక్కెదరుగా! (హరి)

చరణం : కొండను జుట్టిన, కొండ చిలువైనను
దరి చేరిన దానినె, భుజియించును "2"
మరి మనుజుడేల, అందినదొదలును "2"
అందని దానికై యత్నించును (హరి)

ఆత్మకు అంతములేదన్నా

పల్లవి : ఆత్మకు ఎన్నడు అంతము లేదన్నా "2"
ఈ ఆత్మకు ఎన్నడు అంతము లేదన్నా!

అ.ప : ఎన్నడు మలినము కానే కాదన్నా "ఆత్మకు"

చరణం : "మనమను" అంటుయె, అంటదు రోరన్నా
"మనదను" జాడ్యమె, పట్టదు రోరన్నా "2"
ఏబంధముల చిక్కక, ఆనందపడునన్నా
జంజ్యాటముల వలలో, చిక్కదు ఓరన్నా "ఆత్మకు"

చరణం : జీవము వుంటే రారాజువురన్నా
అది లేకుంటే, నీవెవరోరన్నా
జగన్నాధుని చరణాల జేరుర ఓరన్నా
జగన్నాయకుని ఆనతి గైకొనరోరన్నా "ఆత్మకు"

చరణం : చిదానందముతో మెలగుమురోరన్నా
చిక్కులలో నువు పడకుర, ఓరన్నా
ఆత్మానందము, నీహక్కురన్నా
ఆత్మకు సాక్ష్యము అక్కర లేదన్నా "ఆత్మకు"

ఎరుగనైతిని

పల్లవి : ఎరుగనైతిని, కడకు నేనెవరినని "2"
నీ చేతయు నేనని, నీ సృష్టియును నేనని
ఎరుగనైతిని, ఎరుగనైతిని, ఎరుగనైతిని, ప్రభూ! "ఎరుగ"

చరణం : "నాది" యని, నే దానము సేయగ
ధర్మము సేయ, నేనెవరిని తండ్రీ! "2"
"నీది" అంతయు "నాది" యని తలచుచు "2"
సంబరపడుదునే! సర్వాత్మా! "ఎరుగ"

చరణం: వేడుకలందున నా ఘనతేయని
సంతసమంతా, నా సొంతమనుకొంటి "2"
ఓర్వగలేని పెను ఇక్కట్లు కలిగిన "2"
నా కర్మ ఫలమని తలువజాలా! "ఎరుగ"

చరణం : ఆత్మలోన పరమాత్మ యుండునని
జీవితమంతా సత్కర్మలకేనని "2"
తెలిసి, నేగన్నులు, తెరచితిని, స్వామీ! "2"
నమ్మితి, నీసేవ కొరకే నేనని "ఎరుగ"

చదువులు మెండుగ

పల్లవి: చదువులు మెండుగ ఎంత నేర్చినను
చదువరిని చదువక శూన్యము సుమ్మీ "2"

చరణం : అచంచలమగు అచ్యుతునిసేవలు
మహిలోన బహు చదువులు సుమ్మీ "2"
భువిపైన విద్యలు, ఎన్ని నేర్చినను "2"
శ్రీపాలుని మదిలో నిలుపుము సుమ్మీ
ఆశ్రీపాలుని మదిలో నిలుపుము, సుమ్మీ "చదువులు"

చరణం: ధరణిలోన లౌకిక విద్యలెన్నున్ననూ
లోకోత్తమునీ కొలచుటే మిన్న "2"
ధరణీ ధరునీ, ధరలోన కొలచిన "2"
అవి కొలువుగా లేని విద్యలే సుమ్మీ "చదువులు"

చరణం: ముంగిటి సన్నిధి, ముజ్జగపు పెన్నిధి
నాలుకలపై తేనె లొలుకు ఆ పదము "2"
చదువక నైననూ హరినామము "2"
జాలువారిన చాలును,సుకువగును పరము "చదువులు"

జనన జీవన

పల్లవి: జనన జీవన చక్రమందున "2"

ఇరుసు తానై ఇలను ఏలును

అ.ప : యుగముల దైవము, శ్రీ హరి తప్ప

వేరొక దైవము లేనేలేదు "జనన" "2"

చరణం : జీవననౌకను ఈదుటలో

పలురేఇంబవళ్ళు గడచినవి "2"

మనసు మరల్చు సమయమున "2"

వయసుడుకు వేళలు, సమీపించినవి స్వామీ!

నిను జేరు వేళలు దగ్గరైనను "2"

ఇహలోక వాంఛల,మునిగితినయ, నేను "జనన"

చరణం : కూపస్థ మండూక చందమున

సంసార కూపమున మునిగితిని "2"

భువి పైన జన్మ లెన్నున్న "2"

మానుషజన్మము పరమోత్తమము, స్వామీ!

మరుజన్మకైనను, నీ స్మరణయె తప్ప "2"

అన్యము ఎరుగక, యత్నింతునయా! "జనన"

జీవాత్మ పరమాత్మ

పల్లవి : జీవాత్మ, పరమాత్మ ఒకటేరన్నా!
ఇక నేనను, నీవను బేధమె లేదు, లేదన్నా "2"

అ.ప: పరమాత్మను నీవు, నీలోన కనరన్నా
పరతత్వమంటూ ఎచటనో లేదన్నా
ఓ లాలా, ఓ లాలా, ఓ లాలా.... "జీవాత్మ" "2"

చరణం : నీ సాటివారితో సఖ్యతగా నువు మనుమన్నా
నీ తోటివారినీ ప్రేమించుటయె, మరి మిన్నన్న
సాటి జీవులపై కనికరము కనరన్నా!
నీ పాటికి నీవే వుండుట, ఇకమరి తగదన్నా"జీవాత్మ" "2"

చరణం : అన్నెం,పున్నెము,ఎరుగని ఈ తరువులపై జాలి చూపన్నా!
నీ ఆత్మకు సాక్షివి నీవేరా! ఓరన్నా ఇది ఎరుగన్నా
నీ ఆత్మ శోధనయె పరమాత్మను జేర్చన్నా
అదియే సుఖము,ఇలలో ఇతరము యికలేదన్నా "జీవాత్మ"

పూవునకు పూదారమునకు

పల్లవి : పూవునకు, పూదారమునకు బంధమేల యుండునో!
అలదైవమునకు, ఈ మానవునకును, బంధమటులనే
తెలుపగను "హరిలోరంగ హరీ" "2"

చరణం : పూవునకు, పూతావికిని, బంధమేల యుండునో
మాధవునకు, మానవునకునూ,
అటులనే బంధముండును
తరువులకు, మరి వ్రేళ్ళకూ గల
బంధమెటులుగా యుండునో
మనుజునకు, అలదైవమునకు ను
అటులనే బంధము "పూవునకు"

చరణం: నగమునకు మరి భువికినీ గల
బంధమెటులనో తెలుపగను
నగధరునకు మరి నరునకూ గల
బంధమదియే యోచించగా
తల్లికీ, మరి బిడ్డకూ గల బంధమేలనో ఇలలోన
మహీధరుడు,మనుజునకూగల
బంధమే ఆబంధము "పూవునకు"

బహు జటిలమగు జీవన యాత్రలో

పల్లవి : బహు జటిలమగు ఈ జీవన యాత్రలో
బంధ మోచనుడు, చుక్కాని తానేగా "2"

అ.ప : జాగరూకులై జనులంతా మసలుకొన్న
మరి ఎరుగక, మాయాజాలములో చిక్కెదరు
ఈ మాయాజాలములో చిక్కెదరు "బహు"

చరణం : తేనియ పలుకులు, పలుకుచునే
తెప్పక్రింద నీరువలె చల్లగ చేరు "2"
ఘనుల నుండి కాపాడు ఘనుడవు "2"
నీవేగా తండ్రీ,! మా విభుడవు "బహు" "2"

చరణం: అదె! జూడరాతడె మహిమాన్వితుడు
కాలాంతకులను అంతము జేయు "2"
తలచిన వారికి తరగని దైవము "2"
తలదన్ను వారికిని, తలమానికము "బహు"

వెట్టి యోచనలు

పల్లవి: వెట్టి యోచనలు, మస్తకమున నిండుగ
ఎటు పోతువే, నీవు ఓ మనసా "వెట్టి "
ఓ మనసా! ఓ మనసా! "2"

చరణం: దానవవైరిని కానక, మనుజుల మాటలను, నీవు
అనుసరించిన, అది ప్రమాదముగాదే "2"
దనుజ లోకమున, త్రికరణ శుద్ధిగ "2"
వెదుకగ దైవమును కనగలవు
ఓమనసా! ఓమనసా "వెట్టి " "2"

చరణం: మాయపు ఛాయల, వెంటన ఎంతగ నీవు
పరుగిడిన, కనలేవు నీవు, పరంధాముని
పరముతానని, నీవు తలచిన నాడే "2"
నీ నీడే అగును, పరమాత్మ రూపము
ఓ మనసా! ఓ మనసా! "వెట్టి " "2"

ఓ బొజ్జ గణపయ్య

జై జై గణేశా! జై జై "2"

పల్లవి: ఓ బొజ్జ గణపయ్య, నీ సాటి ఎవరయ్య
నీ పోటి లేరయ్య "2"

చరణం: సురలోకములో, సురల నుతులను
భూలోకపు పాట్లు, ఇక్కట్లను కనలేవా! ఓస్వామి!
ఉండ్రాళ్ళనిన, బహు ప్రీతిలే నీకు
బ్రహ్మాండమునూ, బొజ్జలో దాచితివి నీవు
కుడుములు, భక్షములు, మనసార భుజియించి
కోర్కెలీడేరగా, వరముల నొసగేవు "ఓ బొజ్జ"

చరణం : భుక్తాయాసముతో, ప్రయాసపడు
నిను జూచి సోముడు నవ్వాడులే!
అంత సతీదేవి శాపము నొసగె
అతని గనిన జనులు అపనింద పాలు అగునని
నీ కథను వినినంతనె సర్వలోకమ్ములు
బడయునంట, సౌభాగ్య సిరిసంపదలు
బాధ్రపదపు చవితినాడు, నిను గొలిచిన వారికి
తీరునులే వారికి సర్వాభీష్టములు "ఓ బొజ్జ"

గంగంగణపతిం

పల్లవి : గం గం గణపతిం, గజాననం గణపతిం "2"

గం గం గణపతిం, వినాయకం గణపతిం "2"

చరణం: మూషిక వాహనమెక్కి, లోకాలు దిరిగేవు

ఇక్కట్లు కడతేర్చి, కోరికలు దీర్చేవు

చవితి దినము నాడు ఉండ్రాళ్ళను భుజియించి

కొండంత ఫలములను,అందింతువయ్యా "గం"

గణపతి పప్పా, గణపతి పప్పా,

గణపతి పప్పా మోరియా! "4"

చరణం : ఏకదంతా! నిను పలువిధముల తలతుమయా!

పార్వతి తనయా! మమ్ము గాపాడవయా!

పసిమనసుల కోర్కెలను, నెరవేర్చవయా!

వారి చదువుసంధ్యలందు నిలువుమయా!

జ్ఞాన, విజ్ఞానమను, దీపము వెలిగించవయా

అజ్ఞానమనే తిమిరము పారద్రోలి కావుమయా!

లక్ష్యములో, నీవు లక్షణుడవై

విజయ భేరి, మ్రోగించగ రావయా! "2"

గణపతి పప్పా,మోరియా! గణపతి పప్పా,

గణపతి పప్పా మోరియా! "గంగం" "4"

చరణం: "యద్భావం తద్భవతని" గొలుతమయా!

జిష్ణువైన, విష్ణువైన నీవెనయా!

ముల్లోకపు ఏకదైవము నీవెనయా!

తొలి పూజలు గైకొందువు రావయా!

నీ"నిమజ్జనము"లోని పరమార్థము దెలిపితివి

"భక్తిమునక" కల్మషమును, కడిగి వేయునంటివి

సజ్జన సాంగత్యము మేలంటివి

వారిని ఎన్నడు వీడొద్దంటివి "2"

గణపతి పప్పా, గణపతి పప్పా,

గణపతి పప్పా మోరియా! "గంగం" "4"

గరళము

పల్లవి: గరళము, కంఠము నందున,

దాచిన నాధుడు, నీలకంఠుడు

లోకములెల్లనుకాపాడంగ,

శోకము బాపెను, హరుడు "2"

చరణం : ముల్లోకములకు రక్షకుడు

ముజ్జగములకు పాలకుడు "2"

జగతి క్షేమమే పరమావధిగా

జనులకు ఆతడె ఆదిదేవుడు

శంభో శంకరా! హర హర మహదేవా! "గరళము" "2"

చరణం: సనాతనుడు మా శంకరుడు

అనాధ నాధుడు ఈశ్వరుడు "2"

శివశంకరుడు, సుమదరహాసుడు

భూతనాధుడు, భూతాత్మకుడు

శంభోశంకరా! హర హర మహదేవా! "గరళము""2"

గిరిజా రమణ

పల్లవి: గిరిజా రమణ, సుందర చరన, హర ఓం నమఃశివాయ
సంకట హరణ, సన్నుత చరణ, శివ ఓం నమఃశివాయ
రూపం నమఃశివాయ, పూజ్యం నమఃశివాయ,
పాదం నమఃశివాయ, ధన్యం నమఃశివాయ "గిరిజా"

చరణం : దక్షప్రజాపతి దర్పము బాపిన, హర ఓం నమఃశివాయ
వీరబద్రునిగ సుయజ్ఞ నాశము చేసిన నమఃశివాయ,
గమ్యం నమఃశివాయ, నాట్యం నమఃశివాయ,
గానం నమఃశివాయ నామం నమఃశివాయ,
క్షీరమధనమున గరళము ప్రింగి హర ఓం నమఃశివాయ
ముల్లోకములను కాచి, బ్రోచిన శివ ఓం నమఃశివాయ
భావం నమఃశివాయ, భజనం నమఃశివాయ,
స్తోత్రం నమఃశివాయ, శ్రావ్యం నమఃశివాయ "గిరిజా"

చరణం : శివతాండవమున లోకములన్నియు, హర ఓంనమఃశివాయ
సత్యానందమె పొందెను, దేవర! శివ ఓం నమఃశివాయ
ధమరుక నమఃశివాయ, ప్రమధం నమఃశివాయ
అమరం నమఃశివాయ, అజేయం నమఃశివాయ
బ్రహ్మ, విష్ణునుత, అసుర సేవిత హర ఓం నమఃశివాయ
జగతి అంతయూ కైలాసమె కద! శివ ఓం నమఃశివాయ
ధర్మం నమఃశివాయ, దైవం నమఃశివాయ
సత్యం నమఃశివాయ, నిత్యం నమఃశివాయ "గిరిజా"

చరణం : జగదంబను నీ అర్ధభాగమున హర ఓం నమఃశివాయ
నిలిపి బంధమును చాటిన తండ్రీ, శివ ఓం నమఃశివాయ
బంధం నమఃశివాయ, రమ్యం నమఃశివాయ
భవ్యం నమఃశివాయ, భవితం,నమఃశివాయ
సామవేదమున నిత్యము కొలువై, హర ఓం నమఃశివాయ
వేద సారమై వెలుగొందేవు, శివ ఓం నమఃశివాయ
నాదం నమఃశివాయ, వేదం నమఃశివాయ
సర్వం నమఃశివాయ, శివోహం నమఃశివాయ, "గిరిజా"

చిరు మంద హాసం

పల్లవి: చిరుమందహాసం, శివ మందహాసం
సుమదరహాసం,మధురాతిమధురం ఓంనమఃశివాయ "4"

చరణం : తామసములన్నియు, తొలగించు హాసం
తామరపూవు వలె, వికసించు హాసం
తాపత్రయాగ్నులు, శమియించు హాసం
తాపసుల మనముల, వశియించు హాసం
ప్రమధగణములను, శాసించు హాసం
ప్రధమదేవునిగ, నుతులందు హాసం
భువనేశ్వరి మదిన, నిలచిన హాసం
భువనముల పాలించి,లాలించు హాసం ఓం నమఃశివాయ "4"

చరణం : సోముని శాపము, తొలగించు హాసం
ముక్కంటి హాసం, మృదుమంద హాసం
చక్కని స్వామికి, చక్కనైన హాసం
లోకము లన్నియు, శివ హాస లాలసం
కైలాసుని మోము, కళలొలుకు హాసం
కామిత మోక్షములు, దీర్చును హాసం
క్షేమ యోగములు, సిద్ధించు హాసం
ఏకామ్రేశ్వరుని,ఏకైక హాసంఓంనమఃశివాయ"చిరు""4"

ధగ ధగ ధగ

ఓంశంకరా! గరళ కంధరా! చంద్రశేఖరా! శివ,శివశంభో! "2"

పల్లవి : ధగ ధగ,ధగ ధగ ధవళ రూపమున
మెరిసెను, నగమున నటరాజం
ధమధమ, ధమధమ, ధమరుకమ్మునూ,
కరమున మ్రోగెను, ధమధమ, ధం
కైలాసనగమున శివతాండవము
తకధిమి,తకధిమి,కదులగ పదములు "ధగ ధగ"
ఓంశంకరా! గరళ కంధరా!చంద్రశేఖరా!
శివశివశంభో "2"

చరణం : హరిహర రూపమె, కైలాసనాధుడు
జగతికి ఆతడె, ఆధారభూతుడు "2"
స్థితి, లయములకు, మూలకారకుడు
వరము లొసగుటలొ, బోళానాధుడు "2"
పరవశాన శివతాండవం
ప్రమధ గణములకు పరవశం "ధగ ధగ"

చరణం: పార్వతి మోము, నిండినవి నగవులు
భువనైక విభుని ఆనాట్య లీలలు "2"
సప్త సంద్రములు, ఉప్పొంగెనులే!
కాశీనాధుని తాండవకేళికి "2"
నటరాజు ఆడె నర్తనం
ముల్లోకములకు పరవశం "ధగ ధగ"

ఓం శంకరా! గరళ కంధరా! చంద్రశేఖరా! శివ శివ శంభో

వినాయకం

పల్లవి : వినాయకం, శ్రీ విఘ్ననాయకం
గజాననం, శ్రీ గణనాయకం

చరణం: శివ పార్వతులకు కొమరుడివే నీవు
కార్తికేయుని సోదరుడైనావు "2"
మూషికవాహనము, గగనవిహారము "2"
భువినేలగ నీవు రావయ్యా! గణపయ్యా "వినా"

చరణం: మధుర ఫలమ్ములు, పంచ భక్ష్యమ్ములు
ఆర్తితో మేము అర్పింతుమయ్యా "2"
భక్తుల కోర్కెలు శీఘ్రమె దీర్చగ "2"
వరములొసంగగా, రావయ్యా, గణపయ్యా "వినా"

చరణం: సిద్ధి,బుద్ధులను పరిణయమాడి
సందేశమిడెదవు, శిరసావహితము "2"
విద్యాబుద్ధులు, కామితసిద్ధులు "2"
అభయ మొసంగుమా! వరదాతా, గణనాధా! "వినా"

చరణం: గణ నాయకత్వముకై పరీక్షించిన
మాతాపితరుల ప్రదక్షిణముతో "2"
భక్తిశ్రద్ధలను చాటితివయ్యా, నీవు "2"
అగ్రతాంబూలమంది, గెలిచితివి గణనాధా! "వినా"

వినాయకా

పల్లవి : వినాయకా, మా బుజ్జి వినాయకా

విఘ్నాలన్ని, తొలగించే వినాయకా

అ.ప : రావా, వేగమెరావా!

మాపూజలు అందుకోవా! "వినాయకా"

చరణం : చిట్టిఎలుక నీ వాహనం

నువు ముల్లోకములు చుట్టేవట "2"

సుందర రూపము, మందగమనము

మెప్పించేవట, లోకములెల్లను

సాంబశివునికి, ముద్దుబిడ్డడివి

షణ్ముఖునకు సోదరుడవంట "వినాయకా"

చరణం : గణములన్నిటికి, అధిపతివంట

నువు గణపతయ్యగా, నిలిచావంట "2"

నీవేనయ్యా, మా ప్రధమ సుతులలో

ఇచ్చేవంట ప్రమోదమ్ములు

విద్యా బుద్ధుల నొసగుమయ్యా!

వినయమ్ముతోడ మెలిగేమయ్యా! "వినాయకా"

శివనామస్తుతి

ఓం నమఃశివాయ "2"

1 ఓం హరాయ, శివాయ, సత్యాయ, ప్రమోద
తాండవ ప్రియాయ నమోస్తుతే! ఓం నమఃశివాయ "2"

2 ఓం నిత్యాయ,శుద్ధాయ, శ్రద్ధాయ, భవానీ ప్రియ వల్లభ
నమోస్తుతే! ఓంనమఃశివాయ "2"

3 ఓం భస్మ ప్రియాయ, భావగమ్యాయ
ప్రాణదాతాయ నమోస్తుతే! ఓం నమఃశివాయ "2"

4 ఓం స్పటిక లింగాయ, దుష్టదూరాయ మోహనాశాయ
నమోస్తుతే! ఓంనమఃశివాయ "2"

5 ఓం లోభనాశాయ,శ్వేతాంబరాయ,
కరిచర్మాంబరా, నమోస్తుతే! ఓం నమఃశివాయ "2"

6 ఓంఆత్మానందాయ, నాగాభరణాయ,
కైలాసవాసాయ నమోస్తుతే! ఓం నమఃశివాయ "2"

7 ఓం అగ్నినేత్రాయ, సర్వశ్రేష్టాయ, భూతనాధాయ
నమోస్తుతే! ఓం నమఃశివాయ "2"

8 ఓం సనాతనాయ, త్వధర్మనాశాయ సన్మార్గదర్శాయ
నమోస్తుతే! ఓం నమఃశివాయ "2"

9 ఓం త్రిలోచనాయ, సంసార బంధ విమోచనాయ
నమోస్తుతే! ఓం నమఃశివాయ"2"

10 ఓం సర్వాంతరాళాయ, స్మశానవాసాయ
చంద్రశేఖరాయ నమోస్తుతే! ఓం నమఃశివాయ "2"

11 ఓం ప్రమోదాయ, దిగంబరాయ అర్ధనారీశ్వరా
నమోస్తుతే! ఓంనమఃశివాయ "2"

12 ఓం మనోనేత్రాయ, భూతసంఘాయ, భావరమ్యాయ
నమోస్తుతే! ఓం నమఃశివాయ "2"

13 ఓం ధవళరూపాయ, చారుహాసాయ, నీలకంఠాయా
నమోస్తుతే! ఓంనమఃశివాయ "2"

శివానందచరితం

పల్లవి : శివానందచరితం, స్తితికారకం, లయకారకం
ఇది సదానందభరితం "శివా"

చరణం: నాగాభరణం, శోభాయమానం
చంద్ర చూడం, మకుటాయమానం
ఢమరుక ధ్వానం, ఓంకారనాదం
హరుడు నర్తించే ఆనంద తాండవం
ప్రమధగణములు, సురలు భూసురులు
విస్మయత్వముతో పరవశించెను
షణ్ముఖ, గణపతులు, తన్మయత్వము
సమభాగతత్వం, సురనాయకత్వం "శివా"

చరణం : అఖిలాండేశం, అర్ధనారీశం
అసురవరదాతం, రవి సులోచనం
కైలాసగిరిజేసెను పుణ్యము
అఖిల జగములు ముద మాయనులే
అసురుల దునుము పినాకము
అఖిల జగములు స్వర్గతుల్యము
నటరాజరూపం, ఆనంద నర్తనం
భస్మధారణం, అష్టైశ్వర్యం "శివా"

అంబవు నీవె

శ్లోకం : నమస్తే, శుద్ధ సేవ్యాని, ఆర్యే, మందార వాసినీ
కుమారీ, కామినీ, కపాలీ, కపిలే, కృష్ణ పింగళే
భద్రకాళీ, నమస్తుభ్యం, కోటదుర్గా, "నమోస్తుతే"
అంబా, శరణం, జగదంబా "2"

పల్లవి : అంబవు నీవె, జగదంబవు నీవె
జగములనేలే, జననివి నీవే
అంబా, శరణం, జగదంబా! "2"

చరణం: భరతాది మునివరులు, నిను బూజింపగ
ఆనంద మనముల వచ్చిరి తల్లీ!
జలజాక్షి! నీ, మహిమ వర్ణింప తరమా!
నీవే, మాతల్లి, దాక్షాయణీ!
నవ మల్లెలు, చంప, కలువలు, సంపెంగ
పూలు తెచ్చి నిన్ను, బూజింతు, ముదమార,
మణిద్వీపము నందు, కొలువుండు మాతల్లి!
వరములీయగ రావె! శ్రీచక్రవాసినీ
అంబా, శరణం, జగదంబా "2"

చరణం: వినినంత, నీపాద మంజీర నాదములు
దనుజుల గుండెల ఘీంకార ధ్వనులు
నవ దుర్గవై నీవు, అసుర సంహారము
జేసి, లోకములు పాలింతువే, తల్లీ
సద్గుణముల రాశి, శివ వామ భాగమున
నెలవుండినావు, శివరమణివై నీవు
నీ సేవయె మాకు, సౌభాగ్యమే తల్లీ!
అభీష్టసిద్ధివి, మా కల్పవల్లివి అంబా, శరణం, జగదంబా"2"

అంబా జగదంబా

పల్లవి : అంబా, జగదంబా

అ.ప : ఆపదలు బాపేటి, ఆర్తపాలిని

అంబా, జగదంబా,

దుష్టుల పాలిటి భద్రకాళి "అంబా"

చరణం : సరసస్వర రాగమయీ

సర్వలోక వినుతమయీ "2"

సత్యలోక జన పాలిని

సుమధుర సంభాషిణి

అంబా, జగదంబా "అంబా" "2"

చరణం : ఇహలోభ నాశినీ

ఈప్సితార్థ ప్రదాయిని "2"

అమృతవర్షిణి నీవు

అమృతాంశ సంభూతిని

అంబా, జగదంబా, "అంబా" "2"

చరణం : అష్టదిక్కులు పాలించే

పరమేశ్వరి, పరమపావని "2"

దుష్ట సంహారిణి,

దురితవిమోచని నీవు

అంబా, జగదంబా"అంబా" "2"

ఏమని వర్ణింతు

పల్లవి : ఏమనివర్ణింతు,

నిను నే నేమని వర్ణింతు "2"

అ.ప : జగతి అంతయు నీవైతే ఏమని వర్ణింతు "ఏమని" "2"

చరణం: కిన్నెర, కింపురుషులు

నిను నుతియింప కొలువైనారమ్మా!

హిమగిరితనయా, సుందరసుమముల

పూజింతుములెమ్మా

కళ కళగను నీ కాంతులీనెడు, కరుణ చిందు మోము

కల్యాణీ, ఘన సౌందర్య రాశీ!

దాక్షాయణినీవు "ఏమని"

చరణం : బాలాంబిక నీ అద్భుత లీలలు

కని, తరియింతుమమ్మా!

నీ దరహాసం, మమ్ముల బ్రోచే కరుణామృతమమ్మా

సిరి సిరి మువ్వల శుభ చరణీ, సింధూరపుతిలకే

పిలిచిన పలికెడి బంగరు తల్లీ

పూజలు గైకొనవే "ఏమని"

ఓ యమ్మ! దుర్గ మాయమ్మ

పల్లవి: ఓయమ్మ, దుర్గ, మాయమ్మ
మా సల్లని తల్లివమ్మా "2"

అ.ప : అడవంతా నీ సల్లని సూపులే
మాఅండ, దండనీవేలే "ఓయమ్మ" "2"

చరణం : కొండలలో పెరిగాము
కోనలలో తిరిగుతాము
మాఅమ్మోరు నీవేనమ్మా
కాపాడుదుర్గమ్మా, తల్లీ "ఓయమ్మ" "2"
తెలియదాయె, పూజలు
లేవు సదువు సందెలు
తెలిసింది ఒక్కటే, సత్తెవాక్కు
సహాయమె మా జనమహక్కు "ఓయమ్మ"

చరణం : పిల్ల, పాపల కాపాడమ్మా
బంగరు తల్లి ఓ దుర్గమ్మ "2"
మామనసె నైవేద్యంగా పెడతామోయమ్మా
అండ నీవు వుండగా
చెంతరాదు ఆపద "2"
కొండంత దేవత మా గుండెల్లో
కొలువుంటే చాలమ్మా

ఘణ ఘణ ఘణ

పల్లవి : ఘణ, ఘణ, ఘణ ఘణ ఘణ, ఘణ
అందియరవములు
గల గల గల, గల, గల గల
గాజులకరములు "2"
కదలి రావమ్మా! మా బంగారు తల్లి
మమ్మేలగ రావమ్మా ఈ జగమేలు తల్లి "ఘణ" "2"

చరణం: విజయుడు తపమును చేసెను యిచ్చట
పాశుపతమునే పొందెనట, ఇచ్చట
విజయవాడ పురమున వెలిసావట
విజయము చేకూర్చే, చల్లని మా తల్లివట
కనకదుర్గవుగ కనక ధారలను
కురిపించే కాత్యాయనీ!
ముగురమ్మలకు మూల రూపిణివి
ముచ్చట గొలిపే ముగ్ధ మోహినీ "ఘణ" అమ్మా! "

చరణం: కామేశ్వరి, కామాక్షివి నీవట
కాశిలో వెలసిన ఆ విశాలక్షి నీవట
కాశ్మీరపు మహాలక్ష్మి నీవట
మధురలో వెలసిన ఆ మీనాక్షివి నీవట
దుష్టుల నణచెడి భద్రకాళి
సజ్జనుల పాలిటి జగజ్జనని
ఆత్మరూపిణి, ఆదిశక్తి
వెలసిన ఆజన్మాంతర మోక్షప్రాప్తి నొసగుమా "ఘణ"

చందనం పూయ రారె

పల్లవి : చందనం పూయ రారె,అమ్మలాలా!

చలువ చందనం,పూయ రారె,అమ్మలాలా! "2"

అ.ప : అందచందముల సుందరవదనకు "2"

సుందరేశునీ పంకజనయనకు "చందనం"

చరణం: కుంకుమ దిద్ద రారే

కస్తూరీ కుంకుమ దిద్ద రారె, అమ్మలాలా! "2"

ముగ్ధ మోహినికి, లోకపావనికి "2"

నాగాభరణుని, వామభాగినికి"చందనం"

చరణం : హారములేయ రారె

పచ్చల హారము లేయరారె, అమ్మలాలా! "2"

పచ్చని పీతాంబర ధారిణికి "2"

పసిడి సింహాసన పీఠినికిని "చందనం"

చరణం : హారతు లీయ రారె

కర్పూర హారతు లీయ రారె, అమ్మలాలా! "2"

హాస్యముఖీ, హరి సోదరికి "2"

జటాధరునీ హృదయేశ్వరికిని

జగములనేలే! తల్లివి

పల్లవి : జగముల నేలే, తల్లివి నీవు
శివ సతి, పరాశక్తివి "2"

చరణం : అన్నింటను, నీ అభినవ రూపము
మిన్నంటిన, నీ కరుణ లాలసము
వెన్నుతట్టి, దారి చూపించు విధము
సన్మార్గాన, నడిపించు ఘనము
అలరారేవు, అఖిల జగమ్ములు
అఖిల రూపమ్ముల, ఆదిశక్తిగ
ఆయురారోగ్య, ఐశ్వర్యదాయిని
అఖిల చరపుకార్య కారిణి "జగ"

చరణం : శంకర విరచిత సౌందర్య లహరీ
జగదోద్ధారిణి, జగన్నాయకీ
శంకర ప్రియ రమణి శాంకరీ
కైంకర్యముతో సేవింతుమే
విద్యా ప్రదాయిని, వాగ్దేవివి నీవు
వాగ్భూషిణి నీవె, వేదమయివి నీవె
వనజ భవుని ప్రియ పత్నివి
వరములిచ్చెడి వరదాయిని "జగ"

త్రిభువనపాలిని

పల్లవి : త్రిభువనపాలిని, ఆదిపరాశక్తి
పరమపావని, లోకహితైషిణి "2"

చరణం: శుంభ, నిశుంభమర్దినీ "2"
సదాచార ప్రవర్తినీ
సుమందహసిత శోభినీ "2"
కుమార, గణనాధ మాతృకే "త్రిభువన" "2"

చరణం: పరమయోగిని, పాపనాశినీ "2"
పాతకమోచని, పతిత పావనివి
మహదేవరమణి వ్యాఘ్రువాహినీ "2"
మహానాయకి, మహిమాన్వితే "త్రిభువన" "2"

చరణం: కరుణాంతరంగిణి, కమనీయ చరణి "2"
సరళ భాషిణి, సచ్చరిత పోషిణి
ప్రణవ రూపిణి, పరమార్ధదాయిని "2"
కామ్యార్ధ సిద్ధే, కనక వర్షిణీ "త్రిభువన" "2"

నవదుర్గవృగారావమ్మా

పల్లవి : నవ దుర్గవుగా రావమ్మా
నవ నిధులను కురిపించమ్మా "2"
నవ్య కాంతులతో వెలుగొందే "2"
నటరాజ రాణీ నీవమ్మా "నవ"

చరణం: కైలాస నగముల రాణివిలే
కైలాసుని ప్రియ సతి వేలే
కామిత ఫలములు దీరునులే
కామాక్షీ! నినుగొలువగనే
కర్కసులను, నువు దండించి
కనకరాసులను కురిపించితివి
కన్యకగానీవు, విలసిల్లి
కాత్యాయనిగా వెలసితివమ్మా
దామోదరునకు సోదరివే
దుండగులకు నువు, సింహస్వప్నమె
దక్షుని తనయగ జనియించి
దాక్షాయణిగా వెలసితివమ్మా "నవ"

చరణం : సంతాన భాగ్యమును కలిగించే
సంతాన లక్ష్మివి నీవేలే!
సత్వరముగ మా గృహములకు
సంతసమున వేంచేయగరా! రావే
సుందరేశునీ కామినిగా
మధురలోన నువు వెలిశావమ్మా!
సుందర సుమముల పూజించి
మందహాసముల మ్రొక్కెదమమ్మా!
ఆదిలక్ష్మిగ నువు మమ్ములకు
ధనరాసులనే గుప్పితివమ్మా! "నవ"

పదునారు కళలతో

పల్లవి : పదునారు కళలతో కళలొలుకు కామాక్షీ
పద్మనాభసోదరీ, కర్పూరహారతిదిగో

చరణం: దక్షిణ దేశమున, సలక్షణ దేవేరీ
విలక్షణ లక్ష్యములు, దీర్చేటి లక్షిణివి
దక్షుని పుత్రికవు, దాక్షాయణీ
హిమగిరుని తనయవు, హైమావతీ "పదునారు"

చరణం: సర్వాయుధకరివి, సర్వవిధ సంపన్న
ముత్తైదుగ భాగ్యం, వరముగ నొసగెడి తల్లివి
రూపము ఏదైన, మూల శక్తివి
పాపము లన్నియు, పారద్రోలుమా! "పదునారు"

భువనైక జననీ

పల్లవి: భువనైక జననీ, ఆనందవల్లీ
అమృత హృదయిని, అఖిలాంతరంగిణి "2"

చరణం: ఇందువదనే, ఈశ్వర రమణే
ఉన్నతశోభినే, ఉద్ధండ మోక్షిణే "2"
ఉత్పన్నకారిణే, విజయ ప్రదాయినే
ఋద్రరూపిణే, ఋద్రాంబికే "భువ"

చరణం: ఏకాంబరేశ్వరీ, శాకంబరీ
అంతర్యామినే, ఐశ్వర్యదాయినే
పారాయణప్రీతే, ఓంకారనిలయే
ఆద్యంతరూపిణే, ఆధారనిలయే "భువ"

చరణం: సురాసురవినుతే, శుభచరణే
సర్వాయుధకరే, సరసిజనయనే
త్రైలోక్యపాలినే, త్రిమూర్తిరూపిణే
గంధర్వపూజితే, గానప్రియవే "భువ"

వందనమమ్మా

పల్లవి: వందనమమ్మా! అభివందనం
మా చదువుల తల్లీ! అభివందనం
సకల విద్యల సారము, ఈ సర్వశక్తి సాకారము
సత్యరూపమయి, సామగానమయి, హంసవాహినీ "వందన"

చరణం : వీణావాణి, పుస్తకపాణివి నీవే
సకల కళల కాణాచివి నీవే
వికసిత వదనపు శిశిరకాంతివి నీవే
వెలుగు చిందుమా భారతి నీవే
బ్రహ్మదేవుని మానసవల్లి
అష్టసిద్ధు లొసగు నాల్గు వేదముల మూలశక్తివి
ఇల మము తరియింపవె తల్లీ "వందన"

చరణం : స్వచ్ఛమైన వాక్కు, వచనం నీవే
విద్య నేర్పించు సత్యము నీవే
సిరియు, విద్యయు, ఉభయము నీవే
నరులు పొందుదురు భూతల స్వర్గము
విద్యతోనె మనుగడ సతతం
విద్య యొసగు సకలం
విద్య కలిగినచొ ఉన్నత స్థానం
సర్వ సుఖములకు సోపానం "వందనం"

సిరుల నొసగే! శ్రీగౌరీ!

పల్లవి : సిరులనొసగే, శ్రీగౌరీ మంగళం
జయమంగళం,శుభ మంగళం

అ.ప : శుభకారిణి, శ్రీ శక్తి మంగళం
జయ మంగళం, శుభ మంగళం

చరణం : శ్రావణ మంగళ వారములు
శ్రావణ మాస, సౌభాగ్యములు
సంపదనొసగే మంగళ గౌరీ
బుద్ధిని ఒసగే శ్రావణ గౌరీ
సంతసమున మాగృహముల విచ్చేయవమ్మా
ఆనందకారిణి, మంగళదాయిని "సిరుల"

చరణం: సువాసినుల అర్చనలతో
శుభముల నొసగే, జయ,శుభ జననీ
సామ్రాజ్యదాయిని, సర్వమంగళదాయిని నీవే
మంగళ హారతులివె మంగళ శుభగౌరీ
సర్వార్ధకామిని, సత్యపాలినివి "సిరుల"

హిమగిరులభాసించు,కాత్యాయనీ

పల్లవి : హిమగిరుల భాసించు, కాత్యాయనీ

ధవళకాంతుల వెలుగు శ్రీ చక్రిణీ "2"

అ.ప : సత్యసంధాయినీ,శ్రీరూపిణీ "2"

సౌందర్యలహరివే, శుభకారిణీ "హిమ"

చరణం : అర్చనల సేవింతు, శ్రీ శాంభవీ

సంతసము నిండగా, శివరూపిణీ "2"

శివరాణి అయిన శ్రీ పరమేశ్వరీ

ఎల్లలోకములు ఏలేటి శుభ కీర్తివే "హిమ"

చరణం: పాటలీ కుసుమముల, వనవాసినీ

హరి సోదరీ, మాహిమ సుందరీ "2"

కామేశ్వరీ శ్రీ శివకామినీ "2"

జనమోదిని, మా శుభ యోగినీ "హిమ"

చరణం : దైత్య శమని, మాశివశంకరీ

మంగళములివె, శ్రీ భువనేశ్వరీ "2"

నీదు చూపులె మాకు క్షమదాయకం "2"

తల్లి, నీకిదె మా నీరాజనం "హిమ"

కృష్ణంవందే జగద్గురుం

(భజన)

పల్లవి : కృష్ణంవందే జగద్గురుం "2"

కృష్ణ సేవనం, పాప భంజనం (కృష్ణ) "2"

చరణం : నవనీత చోరం నారాయణం

నంద బాలం నాభిన కమలం (కృష్ణ) "2"

చరణం : దేవకి తనయం దానవ అంతం

కర భంజనం అక్రూర ప్రియం (కృష్ణ) "2"

చరణం : త్రేతాయుగము రామ జననము

రావణ హననము రామరాజ్యము (కృష్ణ) "2"

చరణం : కలియుగ దైవం శ్రీ శ్రీనివాసం

కామితార్థము సర్వం సఫలం (కృష్ణ) "2"

క్షీరాంబుధిలో క్షీరప్రియుండు

పల్లవి : క్షీరాంబుధిలో, క్షీరప్రియుండు
కొలువైయున్నాడు, స్వామిని చూడరో జనులాలా "2"

చరణం : చక్కదనముతోడ, చక్రధారియె వాడు
చక్కని తల్లి ప్రియ చెంగల్వే వాడు "2"
చక్కని, చిక్కని నగవుల రేడు
చక్కనయ్యా! అని పొగడరే మీరు "2"
చక్కనయ్యా! అని పొగడరే జనులాలా (క్షీరాంబుధి)

చరణం : చెక్కిలి, చెక్కుల, తళుకు బెళుకు వాడు
చుక్కానిగ మము నడిపించువాడు "2"
చుక్కలనింగిన, చల్లని రేడు
చల్లనయ్యా అని పిలువరే మీరు "2"
చల్లనయ్యా అని పిలువరే జనులాలా (క్షీరాంబుధి)

చరణం : రమకు విభుడె వాడు రమణీ ప్రియ వాడు
రసాంబుధిలో ఓల లాడించువాడు "2"
రసరమ్యముల గానలోలుడె వాడు
రాధా లోలాయని పాడరె మీరు "2"
రాధా లోలాయని పాడరె జనులాలా (క్షీరాంబుధి)

గోపాలా! శ్రీనందబాలా

పల్లవి : గోపాలా! శ్రీ నంద బాలా

అ.ప. : గోకులమున, మా గోప కిశోరా (గోపాలా)

చరణం: వసుదేవ తనయా, వసుదైక హృదయా
నందన బాలా, నవనీత చోరా "2"
బృందావనమున, మురళీ లోలా "2"
కాళిందిలోనా, నర్తనహేలా (గోపాలా)

చరణం : చిటికెన వ్రేలుపై, గోవర్ధనమును
కురు సంగ్రామమున, విశ్వరూపమును "2"
భువిజమనమ్మున, మృదు మోహనముతో
మురిపించే, శ్రీ మువ్వల బాలా (గోపాలా) "2"

చరణం: భావము చేతనె, భవబంధములను
వనమాలీ! నువు పారద్రోలుమా "2"
ఇహపరమందున, నామము తోడనే "2"
ముక్తి నొసంగుమా! శ్రీహరి, మోళీ (గోపాలా) "2"

చిన్ని కృష్ణయ్యా

పల్లవి : చిన్ని కృష్ణయ్యా, మా చిన్ని కృష్ణయ్యా
గురువాయూరున, వెలసిన ముద్దు కృష్ణయ్యా "2"

చరణం : ముద్దు లొలుకు నగుమోము, కస్తూరి తిలకముతో
కరమున నవనీతముతో, అలరారిన కృష్ణయ్యా "2"
మాత యశోదకు నీవు పదునాల్గు భువనములు
జూపి తాపమునే బాపితివి, కృష్ణయ్యా "2"
బాల్యమునందే, బల పరాక్రమమును
జూపితివయ్యా, రక్కసుల నణంచి "2"

చరణం : వామన రూపమున, బలి దర్పము నణచితివి,
ఆనందము చేకూర్చి, మము బ్రోచిన కృష్ణయ్యా "2"
అవతారమేదైన, ఆంతర్యమొకటె యని
లోకమునకు చాటితివి, శోకమునే బాపితివి "2"
చిన్ని కన్నయ్యా! మా బాల కన్నయ్యా
వేగ రావయ్య! ఏతెంచరావయ్యా! (చిన్ని) "2"

నీ లలిత చరణములు

పల్లవి : నీలలిత చరణములు
పోలిన మృదుపాద కమలమ్ములు "2"

చరణం : గౌగలించెడువేళ సతి సిరినీ
సుమహారములె! మరి నీకరములు "2"
దనుజుల దునిమెడి వేళలందున
అవి మారునులె! ఉక్కు సంకెలగ (నీలలిత)

చరణం : గోళాంత రాళాధిపతిగ నీవు
కానవచ్చేవు, యోగి బృందములకు "2"
వనమాలిగా నీవు కానవచ్చేవులే
బృందావనమున, గోపెమ్మగన్నుల (నీలలిత)

చరణం : కానవచ్చేవు! ప్రణయ రూపునిగ
చేపట్టెడి వేళల, కన్యక రుక్మిణిని
భక్తవరదగ, కానవచ్చేవులే "2"
కరిప్రాణమ్ములు రక్షించువేళల (నీలలిత)

చరణం : చతుర్భుజములతొ, శంఖ,చక్రధరుడై
కానవచ్చెనులె! చిన్మయరూపునిగ
నాభిన, చతురాననుని సృష్టించిన, నిను
గొలుతురే, ప్రభూ! పద్మనాభునిగ (నీ లలిత)

మధురం మధురం

పల్లవి : మధురం, మధురం, వదనం, మధురం
మధురాధిపతే, సకలం మధురం "2"

చరణం : మృదుమధురం, వేణుగానం
గోపవనితం, సమ్మోహ మోహనం
మధురాధిపతే, గానలోలం (మధురం)

చరణం : పరాక్రమ, శౌర్యం, రణ పుంగవం
అఖిలలోకం, సుఖజీవనం
మధురాధిపతే, ఆర్తరక్షకం (మధురం)

చరణం : సన్నిహితత్వం, మిత్రబృందం
వరదా భయం, ఆర్తపరాయణం
మధురాధిపతే, అభయహస్తం (మధురం)

చరణం : అభయ ప్రదాతం, కల్పవృక్షం
శ్రీనివాసం, ఆనంద నగం
మధురాధిపతే, లీలామానుషం (మధురం)

చరణం : బాల్యమిత్రం, వరప్రదాతం

అష్టైశ్వర్యం, ఆజన్మాంతం

మధురాధిపతే, కామధేనుం (మధురం)

చరణం : భగవద్గీతం, మూలపురుషం

గీతాసారం, భగవత్ రూపం

మధురాధిపతే, కర్మయోగం (మధురం)

చరణం : అవతార రూపం, ఆంతర్యార్థం

అవసానదశం, కృష్ణచరణం

మధురాధిపతే, జన్మముక్తం (మధురం)

చరణం : భువన త్రయం, వందనీయం

దేవకి నందం, కృష్ణదేవం

మధురాధిపతే, మధురాతి మధురం (మధురం)

లాలీకృష్ణయ్యా

పల్లవి : లాలీ, కృష్ణయ్యా,
మురిపాలా, కృష్ణయ్యా, "2"

అ.ప : నీ ముగ్ధ మోహనము కని
తరియింతు, రారా! కృష్ణయ్యా, (లాలి)

చరణం : కమలలోచనుడా! కమలాక్షి సుందరుడా!
నీకనుదోయికి, కాటుకను దిద్దేము "2"
చీనాంబరము, కస్తూరి తిలకముతో
కళలు, ఒలికించే, ముద్దులకన్నా, రావయ్యా (లాలి)
"లాలీ, లాలీ, లాలీ, లాలీ"

చరణం : గోపెమ్మల యిండ్ల, వెన్నను దొంగిలించితివి
బుంగమూతితో, మము మురిపించెదవు, నీవు "2"
గోవర్ధనమే ఎత్తి, ఇంద్ర గర్వమును "2"
అణచినావయ్యా, ముద్దులకిట్టా, రావయ్యా "2"
"లాలీ, లాలీ, లాలీ, లాలీ"

వెదురు కొమ్మన సప్త స్వరములు

పల్లవి : వెదురు కొమ్మన సప్త స్వరములు
పలికెనులె! అవి వేయి రాగములు "2"
అందరి మది దోచెను
ఆనందుని కడ జేరెను
వేణువై విలసిల్లెను
వెదురు ఎంత పుణ్యము చేసెనో ! (వెదురు)

చరణం : కానల బుట్టేను, కానల బెరిగేను
వాయు తరంగము, గడుపు నింపేను
వెదురు గొమ్మయె వేణువాయెను
తరంగములు సరిగమలు ఆయెను (వెదురు)

చరణం : నంద గోపాలుని కరములందున జేరి
మృదు స్పర్శకు అది పులకించి పోయింది "2"
బృందావనిలో, రాధమ్మ మదిలో
సమ్మోహినై తారంగ మాడింది (వెదురు)

చరణం: ఎల్లగోపాలురు పశుపక్ష్యాదులు
తన్మయత్వమున,ఆడి పాడేరు "2"
గోకులంబంత, మృదు రవళుల
ఆనంద నాట్యముల మురిసిందిలే (వెదురు)

చరణం : నంద గోపాలుని స్పర్శ చేత
వెదురు ఆయెను, పిల్లన గ్రోవిగ, భువిలోన "2"
ఆగాన లోలుని కరుణుంటే
రాయి అయిన, "రత్నము"గ మారేనులే (వెదురు)

సిరి సిరి మువ్వల కృష్ణయ్యా

పల్లవి : సిరిసిరి మువ్వల కృష్ణయ్యా
శ్రీరంగ రాయా! కృష్ణయ్యా "2"

అ.ప : ముద్దు కృష్ణుడవీవయ్యా
మురిపాల బాలా రావయ్యా (సిరి సిరి)

చరణం : కన్నయ్యా! నీ మహిమలు జూపి
గోకుల వాసుల మనసులు గెలిచి
గోకుల బాలా! వేణువు నూది
గోపికలందరి మనమున నిలచి
కలిగించితివీ, నీవు భక్తి భావము
దెలిపితివయ, నీవు వైరాగ్య యోగము
రేపల్లె వాడల వెన్ననుదోచి
నవనీత చోరా! అల్లరి చేసి
మనసులు జేతువె, నవనీత భరితం (సిరి సిరి)

చరణం : కొండలలో వెలిశావయ్య
మాకండగ నీవు నిలిచావయ్య
ధర్మ స్థాపనం, నీ ఆంతర్యం
ప్రతియుగ మందున నీ అవతారం
సత్య, ధర్మ, న్యాయం, నీ లక్ష్యమట,
శోధ, సాధనం, నీ సంపూర్ణత్వమట
కర్మయోగమే, గీతా సారం
ధర్మరక్షణం, మా కర్తవ్యం
నాల్గు వేదముల సారాంశం
అందించితివీ, జీవన వేదం
కలియుగమున, మాకొండలరాయా (సిరిసిరి)

అందాలరాముడు

పల్లవి : అందాలరాముడు, నీల మేఘ శ్యాముడు

అసమాన శీలుడు, మా అయోధ్యా రాముడు "2"

చరణం : తండ్రి మాటకై, కానల కేగినాడు

అతడు,అన్నదమ్ముల ప్రేమకు, ఆదర్శమైనాడు "2"

ఇనకులమున జనియించిన, ఏకపత్నీవ్రతుడీతడు "2"

సతిని గౌరవించి, మనకుసాక్షి భూతుడైనాడు (అందాల)

చరణం : యాగములను కాచి, వేదభూమి చేసెను

సాధుపుంగవుల గాచి, రక్కసులను దునిమెను"2"

వైకుంఠ పతియె గాక, ఇంకెవ్వరాతడు"2"

హృదిలోన సిరిని నిలిపి, ఇల దైవమైనాడు (అందాల)

ఓ హనుమంతా,అతిబలవంతా!

పల్లవి : ఓ హనుమంతా, అతి బలవంతా!

ఈ జగమంత, నీ నామ మంత్రమె పలుకగ "2"

చరణం : పెను సంద్రమునే లంఘించి లంకను

చేరె పవన తనయుడు

దశకంఠుని దర్పమణచ

లంకను గాల్చెను అంజని తనయుడు

లోకపావని సీతమ్మ జాడను తెలిసి కొన్నడు

అంగుళీయకము అమ్మకుయిచ్చి

తెచ్చెను చూడమణీ "ఓహనుమంత"

చరణం: మణిని గాంచిన రాముని కన్నులు (పొంగెను)

నిండెను, ఆనంద భాష్ప ధారలు

కొనియాడె రాముడు, హనుమంతుని

నీ అంతవారు ఇలలో లేరని

మెచ్చె రాముడు నీ భాషణము, ఎంతటి భాగ్యము

అతడి వాక్కే మణి భూషణము, నిత్య నివాసము

"ఓహనుమంత"

రామ నామ పారాయణము

రాం రాం రాం రాం రాం రాం రాం రాం

పల్లవి : రామ నామ పారాయణము
జీవనమె, పావనం "2"

అ.ప : శ్రీ రామపాద రజితము
సకల పాప హరణం "శ్రీ రామ"
"శ్రీ రామ రామ, రామేతి రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామ నామ వరాననే"

చరణం: రామ నామము మదిన నిలుపుము
తాపములన్నియు తొలగిపోవును "2"
శ్రీరాముని చలువ, సుగుణాలవెల్లువ "2"
అభినందనీయం, అనుసరణీయం,
రామ నామము "రామ నామ"

చరణం: తారక మంత్రం, ముక్తిసాధనం
రామ స్మరణం, భవతాపహరణమూ "2"
రామనామము, ముని జన వినుతమూ "2"
శ్రీ రామపధము, పరమ పావనం
రామ నామము "రామ నామ"

రామం రఘురామం

పల్లవి : రామం, రఘురామం "2"

లోకాభిరామం, ఆనంద ధామం (రామం) "2"

చరణం : పితృవాక్య, పరిపాలనయే ధ్యేయం

సోదర భావము, ఆచరణమార్గమై

సర్వ జన సమ్మతమే, రామాభిషేకం

రామరాజ్యము, ప్రజాదరణ యోగ్యం

పతీ, పత్నుల అన్యోన్నతకు

ఆదర్శప్రాయమై, ఆచరణ యోగ్యమై "2"

సత్యపాలనమె, సంస్కారమునకు

రాముని పాలనం, మాతృలాలనం (రామం)

చరణం : రామపాలనయె, పురజనుల క్షేమమై

రామ రాజ్యమె, లోకాభ్యుదయమై

సౌమ్య శీలతయె, శ్రీరామ కవచము

రామావతారమె, లోకానికి హితము

తారక మంత్రం, మనోరంజనం

జానకి రామం, లోకాభివందనం "2"

సరసిజ నయనుడు, కల్యాణ రాముడు

అలరించు జగతిని, ఆనంద హృదిని (రామం)

రామనామము

పల్లవి : రామనామము,మధురమైనదని, అందురేలనే అమ్మా "2"
సకల పాపములు, సమసి పోవును, అందుచేతరా కన్నా
"రామ, రామ, రామ, రామ, రామ, రామ, రాం" "2"

చరణం : బాల రాముడు, రామచంద్రుడు ఆయనేలనే, అమ్మా "2"
అద్దమున, చంద్ర బింబము చూచి, కిల కిల నవ్వెను కన్నా!
సోదర ప్రేమకు "పట్టుకొమ్మ" ఏలఆయనే అమ్మా!
అన్నదమ్ముల మధ్య బంధమును, పెంపొందిచుటకు,కన్నా!
' 'రామ, రామ, రామ, రామ, రామ, రామ, రాం" "2"

చరణం : ఆలుమగల బంధానికి, వారే అందం, అందురు ఏల!
లక్ష్మీ నారాయణులు, లక్షణ మణి పూసలురా! కన్నా
తండ్రి మాట జవ దాటనివాడని, ఏల అందురే అమ్మా!
తండ్రీ తనయుల బంధమును, చాటి చెప్పుటకు, కన్నా!
' 'రామ, రామ, రామ, రామ, రామ, రామ, రాం"

చరణం : రాజ్యము వీడి, అడవులకు మరి, ఏల వెళ్ళెనే, అమ్మా!
రాయినిసైతం "రామమయం" చేసేటందుకె, కన్నా!
ఆలిని బాసి,అసువులిమకగ, దుఖ్ఖించె నేలనమ్మా "2"
పదితలల రావణునంతము జేసి,శాంతి నిలుపటకు,కన్నా!
"రామ, రామ, రామ, రామ, రామ, రామ, రాం" "2"

చరణం : రాముడు, అందరి దేవుడాయెను యేల చెప్పవే, అమ్మా!
సర్వ గుణములకు, పెద్ద పీటను, వేసినందుకుర, కన్నా!
దేవ దేవుడు, అవతారములు, దాల్చు నెందుకే! అమ్మా!
దానవుల జంపి, ధరణి కాచుటకు కన్నా!
"రామ, రామ, రామ,రామ, రామ, రామ, రాం" "2"

వేదాంత వేద్యా

పల్లవి : వేదాంత వేద్యా, వేదనిలయా "2"

అ.ప : మహిమాన్వితము, నీ మానుష జన్మము (వేదాంత)

చరణం : నరుని రూపమున అవతరించిన
నాద రూపమా! నారాయణా "2"
భవ బంధములూ పారద్రోలే
భాగవతోత్తమా! భయాపహారా! (వేదాంత)

చరణం: ఇంద్రాది సురలను, గాంచి మిగుల
అచ్చెరు వొందితివి, రామ తేజమా "2"
విషు?పధమూ నీవే కాదా!
విశ్వమునకే, తండ్రివి గావా! (వేదాంత)

శ్రీ ఆంజనేయం అసమాన కాయం

పల్లవి : శ్రీఆంజనేయం అసమాన కాయం
అంజనీతనయం అపురూప తేజం "2"

చరణం : దినకరుని ఫలమని తలచి నీవు
నింగికెగరి వరములె బడసితివి "2"
లోకపూజితము నీ అమృత భాషణము
రాముని హృదినే దోచిన ఘనుడవు (శ్రీఆంజనేయం)

చరణం : నీ శక్తి నీకు తెలియరాదు
నిను స్తుతియింపగ అంతటనీవు "2"
సకల లోకముల నుతులందేవు
వీరాధివీరుడవు వీరాంజనేయుడవు (శ్రీ ఆంజనేయం)

చరణం : రాముని కార్యము అవలీలగా జేసి
హృదయమున రాముని నిలిపినావు "2"
సుందరకాండకు సుందరుడే నీవు
మహిమాన్వితము నీపావన చరితము (శ్రీ ఆంజనేయం)

చరణం : కీర్తి యశస్సుకు మారుపేరుగా
నిను పూజించిన తిరుగులేదుగా "2"
అమృతమయుడవు అసమానదేవుడవు
ఆర్తులపాలిట కామధేనువు (శీఆంజనేయం)

శ్రీ ఆంజనేయం (దండకము)

పల్లవి : శ్రీ ఆంజనేయం, హృదయాంజలీయం
ధ్యానాంజ నేయం, దాసాంజనేయం "2"

చరణం: లోకపావనము, శ్రీవాయుపుత్రం
లోకపూజితమూ, అభయాంజనేయం "2"
శోకనాశనము, కేసరీతనయం
పాతక నాశనము, పవిత్రహృదయం (శ్రీ)

చరణం : శ్రీరామకార్యం, శ్రీరామదూతం
శ్రీరామ హృదయం, అంజనీతనయం "2"
భూత నాశనము, శ్రీ హనుమంతం
సంభూత కారణం, శ్రీ పింగాక్షం (శ్రీ)

చరణం : దైత్య నాశనము, వీరాంజనేయం
దౌర్బల్య నాశనం, మారుతీబలం "2"
ధన సంప్రాప్తం, శూరాంజనేయం
సతతం స్మరణం, అమితం విక్రమం (శ్రీ)

శ్రీ సీతారాముల కల్యాణం

పల్లవి : శ్రీ సీతారాముల కల్యాణం
కనివిని ఎరుగని వైభోగం "2"

అ.ప. : హరికీ, సిరికీ కల్యాణం
దివిలో, భువిలో రమణీయం "శ్రీ సీతా"

చరణం: కోసలేంద్రునీ కల్యాణం
కనిన కలుగును, పెనుపుణ్యం "2"
కన్నుల పండుగ ఆజంట "2"
మనమెన్ని జన్మలకు కనలేమంట "శ్రీ సీతా"

చరణం: ధర్మ స్థాపన శ్రీ కారం
ధర్మ నితతికీ సాకారం "2"
ధర్మ మూర్తిగా నిలచు విగ్రహం "2"
శివ కేశవులకు ప్రతి రూపం "శ్రీ సీతా"

చరణం: లోకకల్యాణం, రాముని జననం
లోకోద్ధరణమె, రామమతం "2"
దుష్ట శిక్షణం, శిష్ట రక్షణం "2"
ఒసగెను, జగతికి ఆనందం "శ్రీ సీతా"

అలరించగ

పల్లవి : అలరించగ, శ్రీ వేంకటపతిని

అవతరించెను, మన అన్నమయ్యా "2"

అ.ప: కరనాడున, అల విఠలుని సేవింప

ఇల పురంధరుడు జనియించెను "అలరించగ"

చరణం: విష్ణుతేజము ఘన అన్నమయ్యది

పురంధరునిది మరి బ్రహ్మా తేజమే "2"

వీరి కలయిక కలిగె జగతికానందమె

ఆనందమే, పరమానందమే "అలరించగ"

చరణం : కర్ణాటక, మణిమాణిక్యములు

పురంధరుని విరచితములు, ఎనలేని కీర్తనలు "2"

ఆంధ్ర దేశపు పసిడి పచ్చల హారములు "2"

అన్నమయ్య కృతుల శృంగారములు "అలరించగ" "2"

చరణం: అన్నమయ్య పురంధరుని భావనలు

ఎల్ల జగతికి నిండు దీవెనలు "2"

ఇరు తేజములు ఇలను ఒక్కటైనవి "2"

భక్తి మార్గము యిక సుళువైనది "అలరించగ"

ఆనందం

పల్లవి : ఆనందం, జగదానందం
సహస్ర దీపం, సంధ్యాసమయం "2"

చరణం : ఉభయ దేవేరీ సహితుండై
కొలువు దీరెను, వేంకట రమణుడు "2"
సహస్ర ప్రభల, కాంతి వెలుగులో "2"
వెలిగేనూ, చిన్మయ రూపుడు (ఆనందం)

చరణం : అజ్ఞానమను దివ్వెలలో
సుజ్ఞానమనే తైలము నింపి "2"
వెలుగు దివ్వెలు, ప్రోలెను ఆత్మలు "2"
కాంతులీను, శ్రీ కాంతుని జూడగ (ఆనందం)

చరణం : ముగ్ధ మోహనుడు, శ్రీవేంకటేశుడు
ఓర జూపుల, మురిపించె సతుల "2"
మరిపించె అలుకలు, ముత్యపు నగవుల "2"
శోభిల్లె, జగమూయలకాగా (ఆనందం)

ఇసుమంత

పల్లవి : ఇసుమంత తలచిన, ఎంతటి భాగ్యము
ఇంతటి దైవము, ఎంతైనను, కనలేము "2"

అ.ప. : అంతట తానైన, ఆదిబ్రహ్మ రూపము
కొంత తలచినను,అందించును మరి ఘనము "ఇసుమంత"

చరణం: ఎంత వెదికిన, కానగ దుర్లభమైనను
వెదకిన తావుల వెదకితి "2"
తెలుసుకొంటిని, జగతియంతయు వ్యాపించిన విభుని "2"
నగధరుడేయని, గోవిందుడేయని "ఇసుమంత"

చరణం: "సుంత" యును లేడను వారి దర్పముల
నంతయు, జగమంత నిండె, జగన్నాధుడు "2"
"ఎంతో" అయిన హరిని, ఇంతయని, వర్ణింప సాధ్యమా! "2"
సిరివరుడే యని, శ్రీ శ్రీనివాసుడని "ఇసుమంత"

ఎరుగ సాధ్యమా

పల్లవి : ఎరుగసాధ్యమా! యిహమున మర్మము
పరమాత్ముడొక్కడే, పాడియగు ధర్మము (ఎరుగ)

చరణం : నడయాడు భువిలోన,మనుజులు పలు విధముల
నడయాడు నొక్కడే, నిజము, నిధానం
వెరసి, వృక్షచరములు యెన్నియొ, నెలకొనె "2"
సుందర భువిపైన, అన్నిటనున్నాడు (ఎరుగ)

చరణం : అఖిలలోకముల, హితమును, గోరును, సకలాత్ముడు
పలులోకుల గమనము, సరిజేయును, అతడు
అన్నింటను గొలువున్నది, అతడే, అతడే,
జగమంతా నిండెను, శ్రీ వేంకటరమణుడు (ఎరుగ)

కొలచిన వారికి

పల్లవి : కొలచిన వారికి, కొలచిన తీరుల

కొలువని వారికి, కొలచేటి రీతుల "2"

అ.ప : నీ దివ్యకరుణల, నడయాడే

వేంకటరమణా, వేదనారాయణా "కొలచిన"

చరణం: కొండంత ఫలము, కొండంతబలము

కోనేటి రాయుడె, మా కొండంత దైవము "2"

యేడు కొండలలో, కొలువైవున్నాడు "2"

కొండల రాయుడె, మా కులదైవము

వేంకటరమణా, వేదనారాయణా "కొలచిన" "2"

చరణం : అన్నింటను, నీ అండయే వున్న

ఇలనిది లేదను, చింతయే కనము "2"

కైవల్య పదమునకు, కారణభూతుడు "2"

మూర్తీభవించిన, కారుణ్యజలనిధి

వేంకటరమణా, వేదనారాయణా "కొలచిన" "2"

చరణం : ప్రాభాతవేళల, నీ పదాంబుజముల

సేవయె మాకు ఇహపర సౌఖ్యము "2"

కలియుగమందున ప్రత్యక్షదైవమై "2"

వరములు కురిపించే, వరదాయకా

వేంకట రమణా, వేదనారాయణా "కొలచిన" "2"

తెనుగునాటను

పల్లవి : తెనుగునాటను బుట్టి, జానపదమునకు

వన్నెతెచ్చిన, వెన్నెల రాజమా!

అ.ప : మా అన్నమయ్యా! నీసాటి ఎవరయ్యా! "2"

చరణం : అన్నప్రాశననాడు, కలమును చేపట్టి

భవితకు, భాష్యము తెలిపిన పాపడు

హరినామమును, వినక, అరమెతుకు ఐనను

ముట్టడీ బిడ్డడు, మురిపించె తనయుడు

అల వేంకటపతి, అర భుజియించినది

దినిన ఆతడు, అవ్యాజకరుణను

పొందె, ఘనుడు మాఅన్నమయ్య నీసాటి ఎవరయ్యా "2"

చరణం : భక్తి, శృంగారముల, సంకీర్తనలచే

కంజదళాయుని, చక్కగా నలరించె

అలరు, అలమేల్మంగపతి, మదిని గెలిచెను

ఇలను, ముక్తిని బడసి, జగతిలో నిలచెను

తొలుత వాగ్గేయకారునిగ తనువెలిగెను

తెలుగు పదములకు, ఆయువు పట్టాయెను

మా అన్నమయ్య తెనుగునాటను "2"

నీ పదముల జేర

పల్లవి: నీ పదముల జేర, ముదమాయె నీవేళ "2"

అ.ప : తిరుమలవాసా! శ్రీ శ్రీనివాసా (నీ పదముల) "2"

చరణం : గరుడగమన, రాజీవలోచన
సాగర సదన, పన్నగ శయన "2"
సర్వ నిలయా, సర్వాత్మకా
సురేంద్ర సన్నుత, సత్య సంధా! (నీ పదముల)

చరణం : సాధు పోషకా! పరమ పురుషా
నిత్య కల్యాణం, పచ్చని తోరణం "2"
అమృత మధనా! ఆర్తపరాయణా!
వైకుంఠవాసా! శ్రీ వేంకటేశ! (నీ పదముల)

మాతల్లి అలమేలుమంగ

పల్లవి : మా తల్లిఅలమేలు మంగ

శ్రీ పతి సరసన, నువు నడయాడంగ "2"

చరణం : వన భ్రమరమ్ములు, నల్లని కురులు

ముగ్ధ సోయగపు, ముసిముసి నగవులు "2"

పచ్చల హారములు, పీతాంబరము "2"

మణిమయ హారముల, చందన గంధి "మా తల్లి" "2"

చరణం : పలుకుల సొలపులు, మృదు మధురమ్ములు

ప్రాత: కాలపు, కోయిల స్వరములు "2"

పసిడి మువ్వల, సరి సవ్వడులు "2"

సంధ్యా రాగపు సరిగమల ఝురులతో "మా తల్లి"

చరణం : వేంకట రమణుని , పట్టపు రాణివి

హృదయము నందున వెలసిన, ఘన అలివేణివి "2"

సకల ప్రసాదిని, సద్గుణ వర్షిణి "2"

వైకుంఠుని ప్రియ గారాల భరణివి "మా తల్లి"

మేలుకో, మేలుకో

పల్లవి : మేలుకో, మేలుకో, మేటి రాయా
మమ్మేలగా, కోనేటిరాయా "2"

చరణం : తిమిర సంహారుని కిరణ స్పర్శతో
మేల్కొనె, జగములు, పుడమి పులకించె "2"
పుష్ప జాతులు ఎల్ల, నీ సేవ కొరకై స్వామి "2"
ఆనందపూయలలు, వూగుచున్నవి,స్వామి (మేలుకో) "2"

చరణం: అలరు ప్రాణేశ్వరి, సురేంద్రాదులు
భక్త సముదాయములు, ఎదురు తెన్నులతో "2"
వేచియున్నవి, స్వామి, నీ చరణసేవకై "2"
దయచూపగరావ, వేగిరమె, గోవింద (మేలుకో) "2"

చరణం : అఖిల జగములు, నీ కరుణ వీక్షణముల
వేచియున్నవి, ఓపన్నగశయనా ! "2"
యదుకుల తిలకా! నీగోష్టి యందున "2"
తరంగములెల్ల, ముదమాయెనుర, తండ్రీ (మేలుకో) "2"

వేంకటాచల నిలయుడే

పల్లవి : వేంకటాచల నిలయుడే "2"
వెలుతులు దీర్చేను, ఆతడే (వేంకటా)

అ.ప : వెల వెల బోవు, మనసులలోన
వెలుగును నింపే, కిరణము ఆతడే (వేంకటా)

చరణం : నగవులు చిలికేటి నగధరుడే
నవనీతముతో, మనసు నింపెనే "2"
అందరి మనసులు, దోచేనే
నంద బాలునిగ, బృందావనమున (వేంకటా)

చరణం : రుక్మిణీ, సత్యల, ప్రియ వల్లభుడే
ఎల్ల జగములకు, విభుడాతడే "2"
ఇద్దరు తల్లుల, ముద్దుల పాపడే
మము గాచేటి, మురళీ లోలుడే (వేంకటా)

శ్రీనివాసుడంట

పల్లవి : శ్రీనివాసుడంట, అమ్మలాలా
వాడు సిరులిచ్చు, శ్రీపతంట, అమ్మలాలా "2"

అ.ప : ఏడు కొండలెక్కి, ఏడేడు లోకాలు
పాలించునంట, అమ్మలాలా (శ్రీ) "2"

చరణం : అందరిని కాచేను, ఆదుకొని బ్రోచేను
అందరి వాడంట అమ్మలాలా "2"
సత్య భాషణల, సత్య మార్గముల
నడుపు దైవమట, అమ్మలాలా
యుగయుగాలకు, ప్రతి మనమ్మున
నిలచు దేవుడట, అమ్మలాలా (శ్రీ)

చరణం : ఆలుమగల మధ్య అన్యోన్యతకు
ఆదర్శ ప్రాయుడంట, అమ్మలాలా "2"
ఎన్నెన్ని లోకాలు, వెదికి చూసినను
అటువంటి దైవమె కానరాడంట "2"
యుగ యుగాలకు, ప్రతి మనమ్మున
నిలచు దేవుడట, అమ్మలాలా (శ్రీ)

అంబరమందిన

పల్లవి: అంబరమందిన అంబుజనాభుడే
మా, డెందము నిండిన, దామోదరుడే "2"

చరణం: అంతరంగముల, అచ్యుతుడే
అందరి మనసుల ఆనందుడే "2"
సుందరవదనుడే, సూర్యతేజుడే "2"
మా అండదండగ ఉండేవాడు గోవిందుడే "అంబర"

చరణం: అద్భుతానంద నందనుడే
నందనానంద పరమాత్ముడే "2"
నీలాంబరుడటనే! నీలాలకేశవుడే
నీలలోచనుడే, నీలాసమేత గోవిందుడూ"అంబర"

ఉయ్యాలా! ఉయ్యాలా!

పల్లవి: ఉయ్యాలా! ఉయ్యాలా! ఉయ్యాలా! "2"

ఉయ్యాలా! వెంకటరమణుకుయ్యాలా "2"

సిరుల హారతీయరే ఉయ్యాలా!

క్షీర ప్రియునకు ఉయ్యాలా!

క్షీర సంభవకు ఉయ్యాలా "ఉయ్యాలా" "2"

చరణం: సీతారమణునకు, ఉయ్యాలా!

పీతాంబరునకు ఉయ్యాలా "2"

అఖిలలోక విభునకు ఉయ్యాలా "2"

అనంత వైభవములకు ఉయ్యాలా "ఉయ్యాలా"

చరణం : శంఖ, చక్ర ధరునకు ఉయ్యాలా!

అసంఖ్య నామ బిరుదునకు, ఉయ్యాలా! "2"

సర్వపాప హరునకు ఉయ్యాలా "2"

సహస్రనామ ధేయునకు, ఉయ్యాలా! "ఉయ్యాలా"

కంటిమి నీదు సుందరరూపము

పల్లవి: కంటిమి, నీదు సుందరరూపము
మా వెన్నంటి యున్న, మంగళరూపము "2"

చరణం: అలమేలు మంగాపురమున, వరముగనిలచి
అలవోకగ, నీ అద్భుత రూపమునే గాంచి
కామితార్ధములు తీర్చును మా కల్పవల్లి "2"
కనక వర్షములు,కురిపించును,మా చల్లని తల్లి "కంటిమి"

చరణం: కొండలరాయుని, కోమలాంగిని, మా తల్లి
మా అండగనుండేటి, అమ్మలగన్నమ్మ
క్రీగంటి చూపుల, వేంకటనాధుని ప్రియసతి
శ్రీపతి అలుకలు దీర్తువు చక్కని మా తల్లి
చక్కదనముతో, మృదుభాషణముల, నగవుల తల్లి "కంటిమి"

కులుకుల కలికితో

పల్లవి: కులుకుల కలికితో తెలుపగ రారే
అల వేంకటపతి, అలుకలను దీర్పగ "2"

అ.ప : పున్నాగవనమును కోరగ రారే "2"
పన్నగశయనుడు, చిరునగవులు చిలుకుటకు "కులుకుల"

చరణం : అరవిరిసిన తామరలతో
తెలుపగ రారే! అలుకలు దీర్పగ "2"
కలువ కన్నుల అలివేణిని కోరరే "2"
కన్నయ్యకన్నుల, మెరుపులునింపగ "కులుకుల"

చరణం : జగమేలు తల్లికినుకు దీర్పగ
అల నీరజాక్షుని, బ్రతిమాలగ రారే
కంజదళాయునుని, కోరగరారే "2"
తన ప్రియ సతి రమణి అలుకనుదీర్పగ "కులుకుల"

చరణం: శృంగార జూపులు, చిరునగవులు కలిసినవి
కన్నుల అనురాగమొలకలై
సంధ్యా వీచికలు చల్లగ వీచే "2"
పిల్లన గ్రోవిన అవి రాగము లాయెను "కులుకుల"

కొమ్మల అంచుల

పల్లవి : కొమ్మల అంచుల, మెరిసే పూతావి వలె "2"
మా కన్నుల నిండుగ వేంకటేశుడు
మా ఆత్మల ఆత్మ జ్యోతి వేంకటేశుడు "కొమ్మల"

చరణం : అమ్మలాల, అలకొండరాయుడే
మా అండ, దండని, తలచేరే "2"
కొమ్మల పూవుల, ఎల్ల తావుల "2"
మనసెల్ల నిండెడు, మహీధరుడు, నగధరుడు "కొమ్మల"

చరణం : ఎల్లలోకములు యేలెడి రాయుడు
ఈ నల్లనిరేడుని, కొలువరే! "2"
చెంతన, చింతలు బాపెడి వాడట "2"
సుంతైనను, మనకు చింతలు, యిక యేల! "కొమ్మల"

జయతు, జయతు

పల్లవి : జయతు, జయతు, ఓ భాగవతోత్తమా!
జయము నీకు ఓ పురుష పుంగవా! "2"

చరణం : తిరుగాడెను, తిరు వేంకటరమణుడు
తిరు మాడవీధుల మోహినీ రూపమున
రామచిలుకను, కరమున ధరియించెను
మన అసువులు, ఎన్నడెగురునో ఎరుగములే!
మనలోన ప్రాణము ఉన్నంతవరకు
తగినంత సత్కర్మలు చేయవలె
అనుజ్ఞ నొసగెను, ఆ అంతర్యామి
మరువకుమా! ఓ మానవోత్తమా! "జయతు"

చరణం: చేతనగునంత చేయి సహాయము
తిలకించు నగవులు, వారి నగుమోముల "2"
దీవించు నిన్ను ఎల్ల వేళలా
అన్నిటికన్న అవి ఎంతయో మిన్న "2"
జేర్చును ఆ దైవసన్నిధి . "జయతు"

తుల తూగేనా

పల్లవి: తులతూగేనా, నా స్వామి,
ధనరాసులకు, మణిపూసలకు "2"

అ.ప. : భక్తియను ధనమును కురిపించగనే స్వామి "2"
సంతృప్తుడగును, సత్యలోకవాసుడు, శ్రీనివాసుడు "తుల"

చరణం: ధన, సంపదలతో తూచగలేము, ఆతని
ధనేతరములచే కొలువజాలము "2"
భక్తిధనముతో ఎవరు గొలిచిననూ "2"
వారికి వశమగును పురుషోత్తముడు, పురుషోత్తముడు "తుల"

చరణం: ప్రియవాక్కులూ, మరినిశ్చలమనము
పరిపూర్ణమైన, భక్తిభావముతో "2"
ఎవర నాతని, తమ మదిన నిలుపునో "2"
వారిహృదిలో ఎపుడూ, కొలువుండును "తుల"

పికముల కిలకిల

పల్లవి : పికముల, కిలకిల రవములతో "2"
ప్రాభాతవేళల, పుష్పాంజలులతో "2"

అ.ప : ఆనంద, సందోహ వందనం,
భక్తులెల్లరును, నీరాజనం "పికముల" "2"

చరణం : తాళ్ళపాక అన్నమయ్య, కృతరాజములతో
నిను అలరించగ, వేచియుండెను, స్వామి "2"
తిరువేంగమాంబ, ముత్యాలహారతితో "2"
గానము సేయగా, వేచియున్నది స్వామి!
వేగమె రావా! వేంకటరాయా "పికముల" "4"

చరణం : సాగరమధనా! సంధ్యాకాంతుల "2"
సప్తగిరులలో, ఎటుతిలకించిన
నీ నామమె, ఇకనీ గానమే, స్వామి
అణువణువూ, మరి నీ ధ్యానమే
వేగమె రావా! వేంకటరాయా "పికముల" "4"

మకుటాయమానం

పల్లవి : మకుటాయమానం, మహిలోనగము
శ్రితపారిజాతమ్, శ్రీ వేంకటేశమ్

చరణం : అల్లంతదూరాన, సప్తగిరులలో
కొలువైనస్వామి, పిలచిన పలికేవు "2"
మోకాలిపర్వత, అంచులు చేరంగ "2"
సాక్షాత్కారము, నీదివ్యరూపము "మకుటా"

చరణం : రాయిలో, రాగములు పలుకును స్వామీ
మోదులు పచ్చగా చిగురించేనులే!
నీదయవుంటే, ఎండమావైనను "2"
చల్లని మారుతము, మా చల్లని స్వామీ "మకుటా"

మరుక్షణమున

పల్లవి : మరుక్షణమున ఏమి జరుగునో!

లక్షణుని తలచుట నీ లక్షణమని తలచు "మరు"

చరణం : పసిప్రాయముననె, నీ మనస్సున నిలుపు

నీ అసువుల, తుదివరకు, ఆ నందుని కొలచు "2"

క్షణము గడచిన కాలమంతయు వ్యర్థమగునుగా

ఈ నిరీక్షణలో, ఈ చంచల మనస్సు నిరర్థకమగును "మరు"

చరణం: మహనీయులు, మహితాత్ములు, ఇలలోన

నగధరుని కరుణను బడయగా, వేత్తురు, తుదివరకు

వేంకటరమణుని, దివ్యకరుణను, ఇలలో పొందుటకు

మానవమాత్రులము, మనజన్మలు అదిపొందగజాలునా! "మరు"

వేదములందును

పల్లవి : వేదములందును, వశియించేను
వేదనలను బాపును వేంకటనాధుడు "2"

చరణం : వేడుకలందునూ, విడువక తాను "2"
వెన్నంటి వుండును, వేంకటనాధుడు
వేద, వేదాంత అంతరంగుడు
ఆశ్రిత జనుల, శరణాగతుడు "వేదము"

చరణం : ఆది, మధ్యాంత రహితుడు తానేలే "2"
అన్నింట వ్యాపించు అఖిలాత్ముడులే!
ఆదిమ పురుషుడు, ఆది దేవుడు "2"
యోగీశ్వరుడు, యోగులకు వశుడు "వేదము"

సుప్రభాత వేళలలో

పల్లవి : సుప్రభాత వేళలలో

షోడస విధముల సేవలలో

అ.ప : నానాభరణ శోభితా

నానా భువన పూజితా "సుప్రభాత"

చరణం: బంగారు పదముల, శ్రుంగారరాయ!

భక్తితో దాసోహ మగుదమయా "2"

అమృతమధనా! నీ అనంత విభవములు "2"

ఆనంద మందార, ప్రాభాత హారతులివిగో "సుప్రభాత"

చరణం: నీపాదసేవయే, నిత్య కల్యాణము

మంగళకరము, మంగళదాయకము "2"

హృదయపీఠమున కొలువైన నీ రూపం "2"

హృదయాలయమున, నిరతము నిలుపగ రావా!

"సుప్రభాత"

గగనము కావల

పల్లవి : గగనము కావల కొలువాయె, దైవము
గగనము కాదులే! ఆతని కరుణ బడయగ "2"

చరణం: ప్రధమ పురుషుడు, ఆదిదేవుడు
జగముల కాయగ, ఇలకు దిగివచ్చును "2"
వరదుడుగా తాను అభయమిచ్చును "2"
గెలుచును తాను, ఈ సకల భువనములు "గగనము"

చరణం : ఆర్తుల బాధలు తను భరించును
అభయ ప్రదాతగ మనలను గాచును
ఆతని కరుణ గురిసిన జాలును "2"
స్వర్గతుల్యమేగా! ఈభువనమెల్లను "గగనము"

గాలి నీరు ఆకాశము

పల్లవి : గాలి, నీరు, ఆకాశము
పొందుట కందరి కవకాశము "2"

అ.ప : పరమాత్మ సృష్టియే, ఈ జగతి, మనమంతయు,
కొలచుటయేకదా! అందరికి ఆలంబనము "గాలి"

చరణం : పరము లేక పరతత్వమును కనలేము
పరమాత్ముడు లేక మరి, మనము మనలేము "2"
పరము, మనమను బేధమె కనబోము "2"
ఉన్నది నీలోనె, పరమాత్మ నివాసము "గాలి"

చరణం : భగవంతుని కానక అంతయు శూన్యము
ఆశూన్యము నందుననే కొలువాయెను, దైవము "2"
నీ మనసే నీకు నిజమగు సాక్ష్యము "2"
నిండెను నీలోనె అనంత ఆదైవము "గాలి"

నాధుడె జగన్నాధుడే

పల్లవి : నాధుడె, జగన్నాధుడే

జగతికంతయు, ఈతడె ఆధారభూతుడు

నాధుడె, జగన్నాధుడీతడు "2"

చరణం : పదునాల్గు భువనములు, పాలించురేడు

పది అవతారములు, దాల్చినవాడు "2"

దిగ, దిగంతములు, తానైన వాడు

దీన జనులకు దిక్కైనవాడు "నాధుడె"

చరణం : ఆర్తపరాయణుడు, శ్రీ ప్రియ వల్లభుడు

ఆర్తుల పాలిటి ఆపద్బాంధవుడు "2"

జనార్ధనుడు, జగములకే విభుడు

జగదోద్ధారకుడు, జగన్నివాసుడు "నాధుడె"

నానాటికీ ఏనాటికీ

పల్లవి : నానాటికీ, ఏనాటికీ

తిరమగు దైవము శ్రీధరుడొక్కడే

తిరమగు దైవము శ్రీధరుడొక్కడే "నానాటికీ"

చరణం: నాలుకల తేనెలూరు పదము

పరమపదమునకు, ఇది మార్గము

హరినామము, శ్రీహరినామము "2"

ఇది నిజము, ఇక హరియే మన పథము "2"

శ్రీహరితప్ప, అన్య దైవమే లేడట "నానాటికీ"

చరణం: నాడును, నేడును, పుట్టుకలేని

నిధియు, నిధానము, చేరువ దైవము

హరి ఒక్కడే, శ్రీహరి ఒక్కడే "2"

జగమంతయును, స్థితి లయలందునను "2"

సృష్టియె తానుగ, వెలుగును ఏనాడు "నానాటికీ"

పరిపరివిధముల

పల్లవి : పరిపరి విధముల, పలురూపమ్ముల "2"
పరిచయమాయెను, పరమాత్మ "2"

చరణం: తండ్రి ఆనతిని, జవదాటని వాడుగ "2"
రాజసమునకు, తను మారు రూపునిగ "2"
వేదములు గాపాడ,అసురుల నంతము జేసి "2"
వేదనారాయణుడు, పరంధాముడు "పరిపరి"

చరణం : బలితాపము నణచు, వామనమూర్తిగ
ధరణిని గాచేటి, వరాహరూపునిగ
కంసాది అసురుల పాలిటి, అనంతునిగ
కలియుగమున మా గోవిందునిగ "పరిపరి" "2"

చరణం : పట్టుబట్టి, ఈ జగములు గాచువాడిగ "2"
తన పట్టుతోడ, దనుజుల దునిమెను "2"
పట్టము గట్టి, మనల నాదరించునుగా "2"
పదార్థమై తాను, ఇల నడిపించును "పరిపరి"

ఫలము పుష్పము పత్రము

పల్లవి: ఫలము, పుష్పము, పత్రము, తోయము
ఏదైనను, నాస్వామి, చిరునగవులు చిందించు "2"

అ.ప : సర్వాయుధిని మనసున నిలుపుము "2"
తనకు అదియే నిజమైన అర్చనము "ఫలము"

చరణం: కొండంత స్వర్ణ భాండమైనను
కానగ, చిరు కానుక అయిననూ "2"
ఏదైనను, తారతమ్యములు లేవులే!
ఎవరికైనను, వసుడగున లే! "ఫలము"

చరణం: భూపాలురు, మరియు పామరులు
కడు బీదలు, ఘన కామందులు "2"
ఎవరికైనను, ఎవరి చేతనైనను
సమసేవల సముడు, నగధరుడు "ఫలము"

చరణం : భావమె గాని, ధన సంపత్తి కాదని
తర తమ బేధమే లేదని "2"
ఎవరు సర్వ మర్పించి కొలుతురో "2"
పరదైవము, వారి మదిన కొలువగును

రావా! రావా! కదలి రావా,

పల్లవి : రావా! రావా! కదలి రావా, హరీ!

నా, కన్నుల నిండెను, నీరూపమే, హరీ! "రావా"

చరణం: పిలచి, పిలచి నేనలసితినయ్యా

నిను, తలవని, క్షణమైన మనలేనులే "2"

గడిపెద, నీ స్మరణలో, ఒక యుగమైనను "2"

నిను గొలువక కష్టము, ఒక ఘడియైనను "రావా"

చరణం : కొండల దేవర, మా అండ నీవేరా

బండ సేయకు, నీ వెన్నగుండెను

అండ పిండ, బ్రహ్మాండములలోన "2"

మాకున్న దైవము, నీవే కాదా! "రావా"

శ్రీ లక్ష్మి జయలక్ష్మి

పల్లవి: శ్రీ లక్ష్మి, జయలక్ష్మి, సంతానలక్ష్మి,
సిరులు కురిపించవే, తల్లి మహాలక్ష్మి, "2"

చరణం: సకల సౌభాగ్యములు, కలిగించు తల్లివి
సద్గుణ, సంపదలు, పొందు వరమీయవే "2"
నిను గొలిచిన క్షణము, కరుణించి, మము నీవు
కనుసన్నల, కరుణ, కురిపించవే తల్లి (శ్రీ)

చరణం: చిరుమందహాసముల, శోభిల్లు తల్లి
మందార మల్లికల అర్చింతుమే నిన్ను "2"
అరవిందుని రమణి, అలరారు చుండగా
అంగ రంగ విభవముల వెలుగు తల్లి (శ్రీ)

చరణం: క్షీరాబ్ధి కన్యకవు, శ్రీ రామపత్నివి
సహన శీలమున అగ్రగామివి నీవు "2"
సకలాభీష్టములు నెరవేర్తువే నీవు
మనసు ఫలకము నందు, కొలువుండు జననీ (శ్రీ)

శ్రీ రంగనాయకి

పల్లవి : శ్రీ రంగనాయకి, వైకుంఠరమణి
దయసేయవమ్మా! మామానసముల

అ.ప : చంద్రసహెూదరి, శ్రీ మహలక్ష్మీ
కరుణించవమ్మా, కమల వాసిని "శ్రీ రంగ"

చరణం : జగతి, నీతో నడచు, అనునిత్యమమ్మా
జీవన పధములో, నీవొక భాగమే
సకలవిధులకు నీవే ఆధారం
సౌమ్య శీలుర గృహమే నీ వాసం
సత్య వాక్కు, సత్య భూషణుల
హృదయములందే సతతం, కొలువుదీరి, కాతువే
మా తల్లి, మహలక్ష్మీ "శ్రీ రంగ"

చరణం : సాగరమధనమున, ఉదయించితివి, తల్లీ
విష్ణుదేవుని పత్ని సిరిగల తల్లివి
సముద్రతనయవు, త్రైలోక్యపూజితవు
కొలువుండవమ్మా, కాపాడవమ్మా!
ఏ గృహము నిత్యము రంగవల్లులతో
తీర్చిదిద్దేనో, అది నీ నివాసము
సుమసుహాసిని, సుమధుర భాషిణి "శ్రీ రంగ"

సిరి సిరి మువ్వల

పల్లవి: సిరి సిరి మువ్వల, సిరిరాయుండే
సిరులతో గూడి, మనల జూడవచ్చేనే "సిరి"

చరణం: కరములలో శంఖ చక్రములూ
ఉదరమున బ్రహ్మాండ మండలం "2"
సిరిగల కన్నులు కాంతు లీడునులే "2"
సిరితో గూడీ కొలువై యున్నాడే "సిరి"

చరణం : జలజానాధుడె, జాలి బూనగ
జాతులన్నిట మిన్న , జాతి బిడ్డయే వాడు "2"
వేదపు రాసులకు, వేదాంతియే వాడు "2"
వేడుకలోనూ, మనల వీడజాలడే "సిరి"

హరి నిను తలచగ

పల్లవి : హరి, నిను గొలచుట, ఎంతటి భాగ్యమో!
హరి, నిను తలచుట, ఎంతటిఫలమో! "2"

చరణం : నిను గొలువని కరము, కరమౌనా!
నిను తలచని మనసు, మనసౌనా! "2"
నీ భావనలేని భావమదేలా!
భవతాపహరా! దురితదూరా! "హరి"

చరణం: నీ యోచనలేని తలపేలా!
నీ బంధములేని తనువేలా!
నిను విడి నేనిక, మనియెద, నది యేల!
నిను గాంచని కనుల వెలుగది యేల!
నా జన్మ నీ సేవకు, అంకితము "హరి"

హలమును చేపట్టె

పల్లవి : హలమును చేపట్టె నొక కవీంద్రుడు
భోగములను నమ్మె నొక కవీంద్రుడు "2"

చరణం : భగవన్నామమె, తన జీవనమని
భగవంతునిసేవే, పరమావధనుకొని "2"
భగవంతుడే తన సర్వస్వమనుకొని
భవసాగరముఈదుట, సుళువనెను,
పోతనా! పోతనా! "హలము"

చరణం : రాజభోగములే తుదిలేని సుఖమని
మహీపాలుర, మన్ననలె, మనుగడ అనుకొని "2"
ముందు చూపేలేక, భోగాలు శాశ్వతమని
మునిగెను శ్రీనాధుడు, ధనసంపదలెల్ల
వృధా ఆయెను, వృధా ఆయెను, "హలము"

చరణం : తలచగ నేర్వము, ధరణీ పాలురు
కరుణింతురెపుడో, కరవాలము దూతురు ఎపుడో "2"
మహీధరుని కరుణయె, ఇల నిక్కము, నిత్యము
ఆతని బడయుటయే నిజమైన మార్గము
నిత్యము, సత్యము "హలము"

అఖిలాత్మకా

పల్లవి : అఖిలాత్మకా! అఖిలాత్మకా "2"
అఖిలరూపమ్ముల, ఆత్మవు, పరమాత్మ (అఖిలా)

చరణం : నీ పదములే, మా యిహ పరమ్ములు
ఆర్త రక్షణ నీకు, అందె వేసిన చేయి "2"
నిగమాగమా! నీ యోగ నిద్రలో "2"
జగములు కాచేవు, జగదాధారా! (అఖిలా)

చరణం : బ్రహ్మావిద్యలు నేర్వగదుర్లభం
నీకృప వుంటే, అవి వెన్నతొ పెట్టు విద్యలే
ఓకృపానిధీ! నీకరుణె వుంటే "2"
సాధ్యము కానిది ఏమున్నదయ్యా (అఖిలా)

ఊయలలూగవయా!

పల్లవి : ఊయలలూగవయా ! కావేటిరంగా
ఊయలలూగవయా! "2"

చరణం : రవి చంద్రులు నీ ఉభయనేత్రములు
నలుదిక్కులు ఆయె చతుర్బాహువులు "2"
అఖిల బ్రహ్మాండము, ఉదరము కాగా
వెలుగు తిమిరములె, డోలాయమానమై (ఊయల)

చరణం : పంచ భూతములు, పంచాయుధములై
ప్రాణి కోటియె, గగనతారలై "2"
ఎల్లవేళల మము కాచెటివాడు
మము పాలించేటి శ్రీ పాండురంగడు (ఊయల)

కరుణాంతరంగుని

పల్లవి : కరుణాంతరంగుని, కను ధృక్కులె చాలు "2"
అభయాంతరంగుని, అభయ హస్తమె చాలు (కరుణ)

చరణం : హరి నిను గొలచిన, హరణములన్నియు "2"
హరి! హరీ! యని పరుగిడవా! "2"
బృందావనమాలి, ఆనందనందుని "2"
నామభజనమె, దుర్జన భంగము (కరుణ)

చరణం : ఆధార నిలయుని అమృత వాక్కులే "2"
ఇల గీతామృతము, గ్రోలగ మధురము "2"
శబరి ఒసగిన, ఫలములు భుజియించి "2"
"ఆత్మశుద్ధి" భక్తి ఆభరణ మంటివి (కరుణ)

మంగళం జయ మంగళం

పల్లవి : మంగళం, జయమంగళం మా ఉరగశయనకు మంగళం

అ.ప : మంగళం శుభ మంగళం శ్రీదురిత దూరికి మంగళం "2"

చరణం: రక్కసులను, మట్టు గరిపెడి, నందకమునకు మంగళం

గొల్లతల్లుల, మనము లందలి, పిల్ల గ్రోవికి మంగళం

మంగళం శుభ మంగళం గోపాలబాలుకు మంగళం

(మంగళం) "2"

చరణం: కాళీయుని దర్పమణచిన వనజవిభునకు మంగళం

ఎల్లవేళల, కన్నుకాచే కోమలాంగుకు మంగళం

మంగళం శుభ మంగళం గోవర్ధనునకూ మంగళం

(మంగళం) "2"

చరణం: సర్వనిలయుడు, మోహనాంగుడు పరమయోగికి మంగళం

క్షీరమధనుని మానసమ్మున వీక్షణమునకు మంగళం "2"

మంగళం శుభ మంగళం మాపద్మనాభుకు మంగళం

(మంగళం) "2"

వేడుకలోనూ

పల్లవి : వేడుకలోనూ, వేదన యందున
నీ పదములె, మా గతియని నమ్మితి "2"

అ.ప: వాడవాడలలోన, వాడియగురూపము "2"
వారధిగానిలచి, వరములొసగేను (వేడుక)

చరణం : అంతర్యామివని నినుకొందరందురు
నిరాకారుడవని మరి కొందరందురు (వేడుక)
వక్కాణింతురు, వేద వేద్యులు "2"
ఏదైనను, నీది దివ్యరూపమని (వేడుక)

చరణం : భక్తాశ్రేయుడవని అందురు కొందరు
భక్తసులభుడని ఇంకొందరందురు
పొగడుదురే, నిను పలునామమ్ముల "2"
ఏమైనను, నీనామమే, నిక్కము (వేడుక)

ప్రేలుపట్టి

పల్లవి : ప్రేలుపట్టి, నడిపించెడి దైవము
వెనుకకు మరలి, యోచించని దైవము "2"

అ.ప. : ఎల్ల తావుల, నిండిన దైవము
ఎల్ల త్రోవల, యుండెడి దైవము (ప్రేలు) "2"

చరణం : దుర్జనులమనముల నిండిన దైవము
సజ్జనులపాలి, చల్లని దైవము "2"
ముజ్జగములకు, మూలము దైవము
మునిగణములకు, ముంగిటిదైవము (ప్రేలు)

చరణం : ముడుల త్రోవలలోన, విడుపుల దైవము
లోగిళ్ళలో, ముక్తి దోసిళ్ళ దైవము "2"
దీనులపాలిటి, ఆది దైవము
ఆధీనమగుదుము, అతడికి మనము (ప్రేలు)

శ్రీ పాండు రంగం

పల్లవి: శ్రీ పాండురంగం, నమామ్యహమ్
శ్రితపారిజాతమ్నమామ్యహమ్ "2"

అ.ప: నీపాదరజితం, నమామ్యహమ్
మాపాపహరణం, నమామ్యహమ్ (శ్రీపాండు)

చరణం : అగణిత నామం, నమామ్యహమ్
మునిగణ పాలనం, నమామ్యహమ్ "2"
సుమధుర చరితం, నమామ్యహమ్
సురాసురవినుతం, నమామ్యహమ్ (శ్రీపాండు)

చరణం: నీలలిత తేజసం, నమామ్యహమ్
సలలితరాజసం, నమామ్యహమ్ "2"
మధురానగరం, నమామ్యహమ్
ఆనంద పోషణం, నమామ్యహమ్ (శ్రీపాండు)

చరణం: కళత్రసంయుతం, నమామ్యహమ్
మధురాతి మధురం, నమామ్యహమ్ "2"
నీపాదయుగళం, నమామ్యహమ్
జన్మహరణము, నమామ్యహమ్ (శ్రీపాండు)

చరణం: నీనామ స్మరణం, నమామ్యహమ్
మోహనాశం, నమామ్యహమ్ "2"
భక్త పోషకం, నమామ్యహమ్
వైకుంఠరాజం, నమామ్యహమ్ (శ్రీపాండు)

సుదర్శనచక్రమా

పల్లవి : సుదర్శన చక్రమా, శుభదర్శన చక్రమా
అసుర భంజనమా, సుర పూజితమా "2"

చరణం : సహస్ర సూర్య కాంతులీను, హరి చక్రమా
మాయా మోహములను, ఛేదించు చక్రమా "2"
శిష్టుల పాలి, శశి కాంతి చక్రమా
కాలుల పాలిటి, కాల చక్రమా (సుదర్శన)

చరణం : అధర్మశీలుర, అంత మొందించుటకై
సహస్ర ధారల, అసాధ్య చక్రమా "2"
లోక కంటకుల, కరడు గుండెలలో
కదము ద్రొక్కేటి, కరకుచక్రమా (సుదర్శన)

చరణం : తారతమ్యములను, తుడిచి వేయు చక్రమా
తామర తూడువలె, సున్నితచక్రమా "2"
కరుణార్ధ్ర హృదయుల, గాపాడుచక్రమా
కరుణాంత రంగుని, కరమున చక్రమా (సుదర్శన)

హరిస్మరణయే

పల్లవి : హరి స్మరణయే, భువిన పరమౌషధము
హరిచరణములను, గొలువుము నిరతము (హరి)

చరణం : జనియించినది మొదలు, సుఖ దుఃఖములను
జీవన డోలలో, ఊయలూగితి "2"
నింగికెగరితి, నేలను జేరితి
తలచితి నన్నియు, ప్రసాదములుగ (హరి)

చరణం : ఇహకర్మంబులగడచె కాలము
వ్యర్ధ భాషణల, నిరీక్షణ సమయము "2"
దౌడు గుర్రములా జేసితి పయనము
ఇటునటుబరుగులు, జీవిత మంతయు (హరి)

చరణం : నీవు సమీపింప, అవసాన దశలందు
మరలించు మదిని, మధుసూదుని యెడ "2"
ఘడియైనను జాలు, పొందుటకు నీవు
దివ్య చరణములు, ద్వారములుదెరువ (హరి)

చరణం : సర్వవ్యాపకుడు, "శ్రీ హరి" తలపే
జేర్చును నిన్ను ముక్తి గమ్యము "2"
నరుని జన్మము, ఉత్తమమని తలచి
కొలచుట సుఖము, పొందుము పరము (హరి)

హరి నీవే

పల్లవి: హరి, నీవే, మా ఇహపర దైవము
హరియే, మాకూ, కైవల్య పదము "2"

అ.ప: యెరుగుము, యెరుగుము, ఓ మనసా! (హరి)

చరణం : హరి, నీగతియే సులభసాధ్యము "2"
హరి, నీతలపే ఇలవైకుంఠము "2"
యెరుగుము, యెరుగుము, ఓ మనసా! (హరి) "2"

చరణం : సురనుతుడే, మాకున్న దైవము
ఆతడు, జగతికి అపూర్వ భావము
పాలించును, ఇలను పీతాంబరుడే "2"
ఎరుగుము, ఎరుగుము, ఓమనసా (హరి) "2"

చరణం : హరి, నీచరణములు, భవతాపహరణం
హరి నామమే మాకు, పుణ్య శ్రవణం
పరంధాముడే, మా మూలధనము "2"
ఎరుగుము, ఎరుగుము, ఓ మనసా! (హరి) "2"

హరినామము

పల్లవి : హరినామము శ్రీహరినామము

అ.ప: పావననామము కడు రమ్యము "2"

చరణం: పలుకుము నామము సుళువగును మార్గము "2"

పలుకు పలుకులయందు హరినామమును నింపు (హరి)

చరణం : చక్కని నామము చుక్కాని యీ నామం "2"

చుక్కెదురైనను నిను చక్కగ దరిజేర్చును (హరి)

చరణం: తరుణోపాయము యీ శుభనామము

అరుణారుణవేళల భజియింపు నామము "2"

కరుణరసములు నిండిన నామము

పరమపదమునకు యిది మన కుడిభుజము (హరి)

చరణం: అతియును గతియును యీ పుణ్యనామము

ఆత్మానందము పొందును మనము "2"

ఆద్యంతములైన శ్రీహరి నామము

తన్మయత్వమున మనసు పులకితము (హరి)

ఆలయం

శ్లోకం : "పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ, దుష్కృతాం

ధర్మసంస్థాపనార్ధాయ, సంభవామియుగే, యుగే"

పల్లవి : ఆలయం దేవాలయం

ధర్మార్ధ, కామమోక్ష,సాధనలకు ఇది నిలయం "2"

అ.ప : అలదైవమే ధర్మ దేవతగ

ఇలలో కొలువుండేదే ఆలయం "ఆలయం"

చరణం : బృహ్మాండమునే ఉదరమున దాచిన

ఆబృహ్మాండ నాయకుని, నిత్యనివాసము "2"

బృహ్మతత్వమును బోధించే బృహ్మాత్మకునీ బృహ్మాండ వాసము

"ఆలయం"

చరణం : ముల్లోకములను ముమ్మూర్తుల యేకము చేసే

ముచ్చటైన ఆ దైవనివాసము "2"

ముజ్జగములకూ మూల రూపమగు

ముకుందునీ ముఖ్యనివాసము "ఆలయం"

చరణం : పరమ పవిత్రత, శుచీ శుభృతకు

నెలవైవున్నది, ఇలలోని ఆ దైవనివాసము "2"

మనసారజని, ముదమారగని,

మధురాను భూతిని పొందునులే! మనము "ఆలయం"

కరుణాంబుధివై

పల్లవి: కరుణాంబుధివై, సిరులను గురిపించే "2"
శ్రీ పతి నీవే గావా!

అ.ప: పరలోకమును జేర్చు పదములు "2"
మాపాలి పెన్నిధియేగా "కరుణాం"

చరణం : పరాత్పరా! నీవు సుర నుతులకు
అందజాలవు, ఆది దైవమా "2"
మాపాలిటి దైవము నీవే "2"
నీపాద సుమములు,ఇహపర సుఖములు "కరుణాం"

చరణం : సత్య సాధకుల, నీవు, నాలుక కొనలందు
ప్రీతినొనర్పగ పలికెదవే "2"
సత్యాన్వేషకుల ప్రియవే "2"
తొలి వేకువగా, మా అండదండగా "కరుణాం"

కొలువగ నితడే

పల్లవి : కొలువగ నితడే, కొండంత సిరియే
తెలుపక రాని, వరదు డీతడే "2"

చరణం : మహిలోన పెనుదైవ మితడే
కలవరములు మాపు కలిమియు నితడే "2"
నిక్కము ఈతడే, మహిమోదరుడే
నిజమగు దైవము, దామోదరుడే "కొలువగ"

చరణం : పలువురు ఈతని పలు నామమ్ముల
స్తుతియించినమా ఏకతత్వమే "2"
ఏకము తానుగ, అనేక తత్వముల "2"
గోచరించును, పరతత్వముతానై "కొలువగ"

జగము నిజము

పల్లవి : జగము నిజము, జనులునిజము

హరిని తలచగ నేల సంశయము! "2"

చరణం : ఝురులునిజము, తరులు నిజము

కరుణాసాగరుని, కరుణ నిజము "2"

మాయ నిజము, మంత్రము నిజము "2"

మహీధరుని మహిమలు నిజము

నిజము, నిజము "జగము"

చరణం : విరులు నిజము, తావినిజము

నిజము విరితావులలో మకరందము "2"

హృదయలయలో, హరియే తావిగ "2"

తరియించు జనుల, మనుగడయె నిజము

నిజము, నిజము "జగము"

దేవదారుపండు

పల్లవి : దేవదారు పండు, దానవాంతక పండు
దివ్యమైన పండు, దిగ్గజమై నెలవుండు "దేవదారు"

చరణం : సత్య లోకపు పండు సరళమైన పండు
బేరసారములు లేని బలమైన పండు
వెలల కొలువ లేని పండు వెచ్చించని పండు "దేవదారు"

చరణం : మధుర ఫలముల పండు ముల్లోకముల నుండు "2"
బుజ్జాయి ఈ పండు బంగారు పండు
"ముకుందుడ"ను ఈ పండు మదిలోన స్థిరముండు
"దేవదారు"

నమో, కేశవాచ్యుతా!

పల్లవి : నమో, కేశవాచ్యుతా నమో! నారసింహా
నమో! పుండరీక వరదనమో! పరమపురుషా "నమో"

చరణం : లోకములెల్లను ఏలగ లోకనాధుండీతడు "2"
మకరముబారిన బడిశరణు జొచ్చినకరిని "2"
వరదవై, కరుణ జూపి కాపాడిన ఏలికా "నమో"

చరణం: సరసిజనయనుడె మనలను సర్వ విధమ్ముల గాచును "2"
లోకాభిరాముడై, శోకములను బాపేను "2"
సకలసుఖమ్ముల కీతడు సాక్షిభూతుడై నిలచు "నమో"

భయమేల

పల్లవి: భయమేల! ఇక భయమేల
అభయ హస్తుడే వుండగా "2"

అ.ప: ఆదియు, అంతము అతడే కాదా
భయమేలనె మనసా! "భయ"

చరణం : భారమేల! నీ చెంతన బంధ విముక్తుడు వుండగ
ఆధారమేల! మరి భూతభావనుడు, నీతోడువుండగ "2"
యోచనేలనే మనసా! యుగపురుషుడు వుండగ
సంకోచమేలనే మనసా! సంకర్షణుడుండగ "భయ"

చరణం : పరదైవమేల మనసా! హరి వెన్నంటే వుండగా
పరమొసగు వరదుడీతడు, పురుషోత్తముడీతడు "2"
పురుషార్థమతడు మనసా! అర్థము తానవునుగ
పరమపురుషుడు మనసా! మన పరమే తానుగ "భయ"

మంగళమనరే

పల్లవి : మంగళ మనరే ముదితలారా
జయ మంగళ మనరే "2"

అ.ప : మంగళ కరునకు వందన మనరే
మంగళ రూపుకు చందనమిడరే "2"
మంగళం, మంగళం, జయ మంగళం "మంగళం" "2"

చరణం : మంగళమనరే, చెంగల్వరాయకు, మంగళమనరే
మంగళమనరే, భూతాత్మకునకు, మంగళమనరే
కులుకుల కలికికి, మంగళమనరే
ప్రియపాలకునకు మంగళమనరే "2"
మంగళం, మంగళం, శుభమంగళం "మంగళం" "2"

చరణం: మంగళమనరే, లోకవిభునకు, మంగళమనరే
మంగళమనరే, విశ్వవ్యాపునకు, మంగళమనరే
అసురాంతకునకు, మంగళమనరే
యుగ పురుషునకు మంగళమనరే "2"
మంగళం, మంగళం, శుభ మంగళం "2"

వినతులివె

పల్లవి: వినతులివె, చేకొనవొ, తల్లీ, వరలక్ష్మీ
హారతులివె, గైకొనవొ, తల్లీ, మహాలక్ష్మీ "2"

చరణం: చేరి అందరము, మ్రొక్కి కోర్కెలను కోరేము
అభీష్టములు నెరవేర్చవె, తల్లీ నారాయణీ! "2"
మానసముల మలినమును, కడిగివేయుమమ్మా "2"
పరిపూర్ణ మనసులనె, అర్పింతుమమ్మా "వినతులివె"

చరణం : తొలివేకువలో, అల కోయిలల స్వరముల
సరిగమల రాగమె, నీ గానముగ "2"
తొలికిరణములు, నీకు అందించునమ్మా "2"
పిండివెన్నెల, దీపారాధనగా, అమ్మా! "వినతులివె"

చరణం : అష్టసిరులను, నీవు అందించగ, రావమ్మా
భోగభాగ్యములను, కరుణించగ, రావమ్మా "2"
నీమువ్వల సవ్వడులె, సంపద కావళ్ళు "2"
నీముత్యపు నగవులె, ముద్దబంతిలోగిళ్ళు "వినతులివె"

వైకుంఠధాముని

పల్లవి: వైకుంఠధాముని దూతలము
అల వైకుంఠపురి, మానివాసము "2"

అ.ప: మోహలోభములను, విత్తమును చేకొని
మోక్షమనే, భాగ్యపు వడ్డీని యిచ్చెడి "వైకుంఠ"

చరణం : నాలుగువేదముల ధనరాసులను
పదునాలుగు భువనముల వారలకిచ్చి "2"
"భక్తి" సంపదలను, భాండాగారమును "2"
చేకొని, "ముక్తి" నొసగు వారలము "వైకుంఠ"

చరణం : దామోదరునకు, దాసులమగుటయె
నిక్కమైన, నిశ్చల భక్తిమార్గము "2"
దాసోహమగును, వారలకాతడు "2"
దాస్యముక్తులను, సేయునాతడు "వైకుంఠ"

సిరిపురవాసినికి

పల్లవి : సిరిపురవాసినికి, శ్రీ మహాలక్ష్మికి "2"
హరి హృదయవాసినికి నీరాజనం
నిత్య నీరాజనం "నీరాజనం"

అ.ప : భక్త జన పోషణికి, భక్తహృదయాలకు
పద్మసంభవకును, నీరాజనం
నిత్యనీరాజనం "సిరి"

చరణం : అంబుజ వాసినీ! అబ్బుర పరచేవు "2"
ఎనలేని, కీర్తి యశస్సుల నొసగి
అంబుజాక్షునీ, హృదయ పీఠమున
వసియించి, సిరులను అందింతువూ
నీరాజనం, నిత్య నీరాజనం "సిరి"

చరణం : మునిగణ సురవినుత, మునిజనానంద "2"
దీనజన పాలికా, దిగంత వ్యాపికా
సాగర తనయా, సరసిజనయనా
సర్వాత్మకాత్మకా, సంతుష్టప్రదాయికా
నీరాజనం, నిత్య నీరాజనం "సిరి"

అంతయు నీవె

పల్లవి : అంతయునీవె, జగమంతయునీవె
నీకరుణ బడయగ, నోచనైతినే "2"

చరణం : ధన, మోహములందు, జిక్కితి నేను "2"
మదమాత్సర్యముల మునిగితి నేను
అంధకారమునే, వెలుగను కొంటిని "2"
అంధుడనైతినే, నిను కానక నే "అంతయు" "2"

చరణం : ఆహారనియమములు, పాటించనైతిని "2"
బంధనములనువీడని, బంధమను కొంటిని "2"
బంధముక్తుడను, కానైతిని నేను, "2"
కడకు నాబ్రతుకే బరువాయెను "అంతయు" "2"

చరణం : ముకుందుడే పరమగతియని నమ్మితి "2"
నీ పదములను ఎన్నడు వీడను (తండ్రీ) "2"
పదరజమున నే రేణువైనను జాలు, "2"
పంకజనాభా! ఓ దీనజనాభా "అంతయు" "2"

అనంతమగు

పల్లవి: అనంతమగు ఈఅనంతుడు

అనంతమునకే అనంతము "2"

చరణం : అనంత నీలాకాశ మందున

ఆద్యంతమును, ఆతడే చరియించును

అనంతనామముల, అనంతబాహువుల "2"

అనాధ నాధుడు, అనాది దేవుడు "అనంత"

చరణం : యోగి బృందముల పరమ యోగిగ

యోగులమదిలో, ఆతడే వశియించును

యోగుల కైనను, భోగుల కైననూ "2"

జపియించిన నామము, వశుడగును సర్వము "అనంత"

తనకు మారుపేరుగా

పల్లవి : తనకు మారు పేరుగా గల
తనను మించిన వారుగా గల "2"

అ.ప : సత్పురుషులు, సత్ప్రవర్తనుల జఠరమునందునె
భగవానుడు జనియించు "తనకు"

చరణం: నిష్కాములు, నిశితాత్మకులును
స్తితప్రజ్ఞులు, సత్కర్మయోగులకు
కర్మాచరణులు, ధర్మాచరణులు
సత్యవచనులు, సత్యాత్మకులుగా
చరియించు జనుల, జఠరమునందుననే "2"
పసిపాపడిగా భగవానుడు జనియించును "తనకు"

చరణం : మనసా, వాచా, కర్మణా
తనను తాను అర్పించుకోగల
దేహచింతయే లేక, యిహమే పరమనుకొని
చరియించువారల, ఉదరమున నతడు బిడ్డగా జనియించి "2"
తాను తరించేనులె! వారిని తరియించి "తనకు"

దూరపు కొండలు

పల్లవి : దూరపు కొండలు నునుపని తెలిసి,పరుగులు

తీతువె ఓమనసా! "2"

చేరువనున్నహరినేమరచి, భ్రమయేనిజమనితలచేవు

(దూరపు) "2"

చరణం : సంద్రమునందు నీటి బిందువు ఏలనో

తెలిసి ఈదుటకు, నువు సాహసించేవు, మనసా!

అందని దానికి చేతులు జాచిన మనసా! "2"

అందినది నువు, పొందలేవులే! మనసా "దూరపు" "2"

చరణం : పొందినదంతయు నీ భాగ్యమని తలచు

ఇక అందినదానిని అందముగా నువు మలచు

అసాధ్యమైనను, మలచుట నీవంతు మనసా

సరి చేయూతను ఒసగుట, తనవంతే మనసా! 'దూరపు"

చరణం : వర్షించు జలము పొలముల పారిన

ఎండిన బీడులే పచ్చని పంటలవునులే మనసా!

ధనము, కాలము, వ్యర్థము సేయకె మనసా!

నువు పలువురకు, మేలు సేయవే మనసా! "దూరపు"

నామమాత్రుడ

పల్లవి: నామ మాత్రుడ నేను,
నామాంకితుడవు, నీవు, హరీ! "2"

అ.ప : మధురామృతము బ్రోలు నీ నామామృతము
గ్రోలగ, మా జన్మ ధన్యము "నామ"

చరణం : అనుకూల, ప్రతికూల సమయమందుననను, స్వామీ!
ఎంచక మానవ తప్పిదములను "2"
అసామాన్య, కరుణను కురిపించి
మమ్ములగాచిన, ఆది దైవమా! "నామ"

చరణం : తలచిన వారలకు, తలచిన విధములుగ
వరముల నందించు, పురుషోత్తముడవు నీవు
తరతరాలకు లోటిడని దైవము "2"
భక్తులముంగిట నోముల పంటా! "నామ"

నారాయణా, నారాయణా

పల్లవి : నారాయణా, నారాయణా
నీనామమె మాగతి, నారాయణా! "నారా"

చరణం : నామస్మరణము, ముక్తిపథము "2"
నామామృతము, గ్రోలగ మధురము "నారా"
నామమాత్రుడను, నీ సేవ కొరకై "2"
ఏమని సేవలు అందింతునూ "నారా"

చరణం : పరమపదమునకు మార్గము యిదియే "2"
పరమాత్ముని జేర త్రోవయె యిదియే "నారా"
పరమేతానై, మనల నడిపించు "2"
యిహపరములకుతావైన ఘనుడు

భావము బాహ్యాము

పల్లవి : భావము, బాహ్యాము, అన్నియును, నీవే! హరీ!
నాభావమున మెరసిన, భాగ్యమునీవె మరీ! "2"

చరణం : అరుదైన స్వామివి,అంతర్యామివి "2"
హరియే నిజమని, నిత్యమని
ఆనతిచ్చెను, నా అంతరాత్మ
మురిసెనామది, మధుసూదనుని గొలువగ "భావము"

చరణం: పలుభావములలో నిలచితివి నీవుకదా!
సకలాభీష్టము నెరవేర్తు సర్వావస్తల, సర్వకాలమ్ముల
కొలువగు దైవము, ఇలలోన
శ్రీహరి ఒక్కడే, శ్రీ హరి ఒక్కడే! "భావము"

మహిమలు తెలుపగ

పల్లవి : మహిమలు తెలుపగ, ఎంతటివారము, మేమెంతటివారం
మహీధరుని వర్ణింపగఎంతటివారం, మేమేపాటివారం "2"

చరణం: ఎన్ని జన్మల పుణ్య ఫలమో "2"
యింతటి కారుణ్య సంపద దొరిగెను
ఏ జన్మ వాసన ఫలితమో
ఈపాటిదయనుబడసితిమి "మహిమలు"

చరణం : పాపులకైనను పరమ దయాళువు "2"
పాపులను సైతము, కరుణించు దైవము
పాప కర్మలను శమియించు దైవము "2"
పాపులనైననూ, పరమపుణ్యులసేయును "మహిమలు"

యుగములు మారినను

పల్లవి : యుగములు, కాలగతులుమారినను "2"

నగధరుడేస్థిరము, ఇదినిజము "యుగములు' '2"

చరణం : చరితలు, కాలగమనమున కలసినను "2"

చరితాత్ముడే నిజమగు నిత్యము "2"

మనుజులు, కాలగమనమున మారినను "2"

మహితాత్ముడే, మహిలోనతధ్యము "యుగములు"

చరణం : ఈతడి సమమగు,దైవమును కనలేము "2"

సమసి పోని, నిధియు నిధానము "2"

సమపాలకుడు, సరసిజనయనుడు "2"

సాగరశయనుడు,సర్వాత్వకుడును "యుగములు"

శ్రీ సత్యనారాయణ వ్రతము

పల్లవి : శ్రీ సత్యనారాయణ వ్రతము
మహిలోన జనులకు శుభప్రదము "2"

అ.ప. : మహిమాన్వితము, మహిమోపేతము
సత్యవరదుని, కధల సహితము "శ్రీ సత్య"

చరణం : పంచాధ్యాయముల వ్రతకల్పము
పంచపాతకములు పారద్రోలును "2"
పంచామృతముల పావనామృతం
పంచేంద్రియములు పరమ పవిత్రం "శ్రీ సత్య"

చరణం: వైకుంఠుని మహిమల వ్రతరాజము
వైకుంఠ ద్వారములు సులభసాధ్యము "2"
వైకుంఠుని నామమె పరమ పవిత్రం
వైకుంఠ ధామమె, పావలవిత్రం "శ్రీ సత్య"

సూక్ష్మమందునూ

పల్లవి : సూక్ష్మమందునూ గనిపించు
బ్రహ్మాండముగా గోచరించు "2"

అ.ప. : నందనందునీ గొనియాడూ
నారాయణునీ గాంచూ "సూక్ష్మ"

చరణం : గిరులయందునూ కనిపించు
గిరిధరునీ కొనియాడు "2"
ఘనాఘనుని ఘనముగను "2"
గమ్యము తానుగ గోచరించే "సూక్ష్మ"

చరణం: సర్వముతానుగ సూచించే
సర్వోత్తమునీ స్తుతియించూ "2"
సర్వలోకములు పాలించే "2"
సహస్ర ముఖినీ కొనియాడూ "సూక్ష్మ"

అఖిలాత్మకుడు హరి

పల్లవి: అఖిలాత్మకుడు హరి ఇది నిక్కమూ
పరమపదమునకు వారధి ఇదినిజము (అఖిలా) "2"

చరణం: పెనుసాగరమును ఈదుట బహు కష్టం
కారడవులదూరు అతికష్టమూ"2"
కఠినాత్ముని మనసు కరగుట దుర్లభం
వానిపై కరుణ గురిపించిన శూన్యం (అఖిలా) "2"

చరణం : దయాసాగరము బొందుట బహు కష్టం
భవసాగరమును ఈదుట గగనము "2"
ఆకసమునంచున తిలకించు యత్నము
నింగీ నేలల ఏకమూ బహు కష్టం (అఖిలా) "2"

చరణం : యోగుల శాపము వెనుదీయుట కష్టము
మూర్ఖుల మనసును మలపుట అతి కష్టం "2"
మరి తరచి చూచిన మానుష జన్మము "2"
పొందుటె దుర్లభం బహు కష్ట తరము (అఖిలా) "2"

చరణం : దానవాంతకుడు హరి కరుణ మనపైన
యున్నఅన్నియు సుసాధ్య మేనన్నా "2"
కనిపించు దుర్గములు పూలదారులై
సులభ సాధ్యములు కరతలామలకములు (అఖిలా) "2"

చరణం : అచ్యుతానంతుడు గోవిందుడు
పరమాత్ముడు ఆ నారాయణుడు "2"
ముజ్జగముల నేలు జగదాత్మజునికి "2"
జయమంగళం నిత్య శుభమంగళం (అఖిలా) "2"

అచ్చటిచ్చటలేని

పల్లవి: అచ్చటిచ్చటలేని, ముచ్చటగురూపము "2"
అచ్చెరువొందేటి, లలితలావణ్య, హరీ!

అ.ప : మెచ్చునటుల, ఈ అఖిలజగమ్ములు "2"
అచ్చముగా, నీవలమేల్మంగపతివి (అచ్చ) "2"

చరణం : సచ్చరితులు, నిను ఉచ్ఛరించెడు తీరు
సత్య లోకములు, నీవు పాలించెడు తీరు "2"
సత్యభావనలలో, నెలవుండుతీరు "2"
సత్య వాక్కులయందు, వసియించు తీరు (అచ్చ) "2"

చరణం : నిశ్చలముగా, మనసులు కొలచెడు తీరు
అష్ట సిరులు, నీవు అందించెడు తీరు "2"
అందించి, మమ్ముల నలరించు తీరు "2"
అవలీలగా, నీవు కరుణించు తీరు (అచ్చ) "2"

చరణం : చిచ్చరపిడుగై దుష్టుల చెండాడెడు తీరు "2"
చిద్విలాసా! నీవు తిలకించెడు తీరు "2"
అభయ హస్తముతోడ, అలరారుతీరు
అఖిల పాపము లెల్ల, రూపుమాపెడు తీరు (అచ్చ)

అటునిటునంతయు

పల్లవి : అటునిటునంతయు, వెదకి చూచితి
యంత వెదకిన, నినుకాననైతినే "2"

చరణం : ఇంతలోన, నేనెంత యోచించి,
నాసొంతమని, అనుకొంటినిన్నే "2"
అంతయు వెదకితి, నేనెంత అనుచితుడ "2"
అంతయునిండిన, అంతర్యామివె (అటునిటు)

చరణం : ప్రాతఃసమయాన ,కొలువుదీరితివని
మేల్గాంచి, నీకొరకే, ఆతురపడితి "2"
నలుదిశలా వెదకి, వేసారితినే
నేర్చితి,నీవే సర్వవ్యాపివని (అటునిటు)

చరణం : అఖిల జీవుల, పోషకుడ వీవని
నేనను, నీవను వర్ణమె వలదని "2"
సకల లోకముల పాలకుడ వీవని "2"
తెలిసి, నను నే మలచు కొంటిని (అటునిటు)

ఈజగమువిష్ణుమయము

పల్లవి : ఈజగము, విష్ణుమయము
నిగమాగమము, శ్రీవిష్ణుపథము (ఈ జగము)

అ.ప : అఖిలాండకోటి బ్రహ్మాండనాయకం (ఈజగము) "2"

చరణం : భక్తాగ్రేసరుడు, మాఅన్నమయ్య
చేసెను, సర్వము దైవాంకితమయ "2"
కీర్తనలనే పూమాలగా జేసి (సంకీర్తలనే)
శ్రీపతి నలరించి, తరియించె నయ్యా (ఈజగము)

చరణం : గోపన్న స్తుతియించె, రామన్న పదము
చేపట్టె, ఆలయనిర్మాణము "2"
పొందెను, గోపన్న కారాగారము
రచియించె, శ్రీరామ సంకీర్తనలు (ఈజగము)

చరణం : శ్రీత్యాగరాయ, శ్రీరామదేవళా
శ్రీరామ సేవయె, మాణిక్య, మణులాయె "2"
సుఖదుఃఖములు, రామునివరమనె
ఆద్యంతములు, శ్రీరామమయమనె (ఈజగము)

చరణం: పోతనవిరచితము, ఆంధ్రభాగవతం
కృష్ణలీలామృతమును, లోకానికందించె
కాసు, కనకములు, విడనాడెనయ్య
ఇహమోహములకు, అతీతుడాయెను (ఈజగము)

జగమెరిగిన వానికి

పల్లవి: జగ మెరిగినవానికి, జంధ్యమెందుకు,
హరినితలచుటకు, నీకు యోచనెందుకు "2"

అ.ప : యోజనదూరము, నీకుయందుకని "2"
నీమానసమున నిలుపుము, ఆతనిని (జగమెరిగిన)

చరణం : చదువూసంపదలు, లోకములేలుటకు "2"
భక్తిసంపద, భాగవతోత్తముని కొలచుటకు "2"
అజ్ఞానతిమిరములు, పారద్రోలెడివాడు "2"
సర్వేశ్వరుడొకడే, జగమేలు వాడు "2" (జగమెరిగిన)

చరణం : ఘనకీర్తికాములు, పదవులుయేలిననూ "2"
పెదవిన,శ్రీహరి పదమొకటే చాలును "2"
పదహారు కళల నాధుడు, పద్మనాభుడితడు "2"
పదాంబుజముల రజ మొకటే చాలును (జగమెరిగిన)

నారాయణ శ్రీ మన్నారాయణ

పల్లవి : నారాయణ, శ్రీమన్నారాయణ "2"

నారద ప్రియనే, నారాయణ "2"

అ.ప : నారాయణ, లక్ష్మీనారాయణ (నారాయణ) "2"

చరణం : దేవకి నందన, భవభయభంజన

ఆత్మానందా, గోవిందా "2"

పరమాత్మనే, శ్రీపంకజనాభ

కరుణామూర్తి, జై గోవిందా (నారాయణ) "2"

చరణం: దురిత విమోచన ,సిరిపాలక ప్రియ

పాహిమురారే, గోవిందా "2"

ఆశ్రితవత్సల, ఆపద్బాంధవ

అభయ ప్రదాతా, జై గోవిందా (నారాయణ) "2"

చరణం: త్రేతాయుగమున, సాకేత రామా

ద్వాపరమందున, గోపాలా "2"

కలియుగమందున, వేంకటరాయా

అవనిని, కాయుజై గోవిందా (నారాయణ)

నీలిమేఘపు ఛాయ

పల్లవి : నీలిమేఘపు ఛాయ నీలోత్పలుడు
నీలి ఆకసమంతా అడుగైనరేడు "2"

అ.ప: నందగోకులమున నేరేడుపండు
నందబాలుడెవాడు నారాయణుడు (నీలి)

చరణం: తెల్లనిఛాయగల క్షీరసాగరమున
కర్పూరపుపండు కమలనాథుడెవాడు "2"
పీతాంబరములో కాంతులీనెడువాడు
దామోదరుడు దేశిమామిడిపండు (నీలి)

చరణం : ముత్యపుబారుల పలువరుసవాడు
నొక్కుకేశముల పసిపనసయెవాడు "2"
సిరిని వక్షమున నిలిపినరేడు
భూసురపక్షమున నిలిచినవాడు (నీలి)

చరణం : విశ్వమంతటయున్న ముంతమామిడిపండు
మధురామృతతొనల కమలాఫలమెవాడు "2"
బహ్మను నాభిన సృష్టించిన ఫలము
బహ్మాండములలోన నారికేళమేవాడు (నీలి)

చరణం : అన్నిఫలములలోనూ యున్నదితానే
మిన్నఫలములనే అందించునుతానే "2"
పదునాల్గుభువనముల పగడమై వెలుగొందు
పదసోపానమున పుష్యరాగమైనాడు (నీలి)

పురుషోత్తముడు

పల్లవి : పురుషోత్తముడు, అమృతమయుడు
సకలజీవులా, నిలయుడీతడు (పురు)

చరణం : చిరు చిరు వెలుగుల దివ్వెల తానే
చిగురు టాకులా పచ్చందము తానే "2"
ఉదయకాలపు, అరుణిమలు తానే
గోధూళి వేళలా కళలనూ తానే (పురు)

చరణం : సెలయేరులలో గలగలలు తానే
గిరి శిఖరములా ఘనతతానే "2"
పికములు జేయు కిల కిల రావముల
సరిగమలు తానే, తానే అంతయు (పురు)

చరణం : ఖ్యాతియు తానే, రీతియును తానే
నీతియు తానే, నిత్యము తానే "2"
నిత్య సత్యము, తత్వము తానై
వెలుగొంది నాడులే, వేంకట నాధుడై (పురు)

పూజింతురే నిను

పల్లవి : పూజింతురే, నిను పలుపూలతో స్వామి

పూలపోలికలతో, వర్ణింతురది, ఏమి "2"

అ.ప.: తపమేమి జేసెనో, నీపదములజేర

అవితపమేమిజేసెనో, నీపదముల జేర (పూజింతురే)

చరణం: అరవిందమా! నిను వర్ణింప రమణీయం

నీదళములబోల్చ, జలజాక్షుగన్నులు "2"

ఎంతభాగ్యమేనీది, ఇల కమనీయము

పద్మనాభునే బోల్చ, జేసితివే, పుణ్యం (పూజింతురే)

చరణం: శశాంకుని వెలుగు, నీమేని తెలుపు

శ్వేతాంగనవు, శోభాయమానవు "2"

కమల నయన, నిన్ను కేశముల దురుమగ

కళలొలుకుదువె నీవు, పుష్పరాజమా! (పూజింతురే)

చరణం : అమరపురవాసిని, సురలోక పూజిత

వెలిగెదవు నిత్యం, రమణుని గళమున "2"

నీఛాయ అయినది, శ్రీహరికి ప్రియముగ

జేసితివి పుణ్యం, నీ జన్మమేధన్యం (పూజింతురే)

చరణం: చంద్రుని చలువల, శశి కిరణమ్ముల

వికసించెదవే నీవు శిశిర కాలమ్ముల "2"

వాగ్దేవి ప్రియతమవి, శ్వేతవర్ణినివి

కలువరాణివేనీవు, కావ్యనాయికవు (పూజింతురే)

బ్రహ్మోత్సవం

పల్లవి: బ్రహ్మోత్సవం, ఇది బ్రహ్మోత్సవం
తిరు వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవం (బ్రహ్మో)

చరణం: సాగరమథనమున గరళామృతము వెడల
కంఠమునందు దాచె, గరళము హరుడు "2"
కాపాడె లోకములు, ఆ సాంబశివుడె
అశృనయనమ్ములా కొనియాడె లోకములు (బ్రహ్మో)

చరణం : అమరులను జేసేటి, అమృతమ్మును
సురలు,అసురులూ, కోరితిరీ సమముగ "2"
మూర్తులూ, ముప్పురు, పడిరి సందిగ్ధమున
యుక్తి సహితంబుగ యోచించె శ్రీహరి (బ్రహ్మో)

చరణం: హరిమారెను, మోహినిగ, సర్వాంగసుందరిగ
అసుర, సురలు యిరువురు, తీరిరీ బారులుగ "2"
వలికించె మోహిని, వలపు వయ్యారములు
మునిగెను, అసురులు, మోహ సంద్రముల (బ్రహ్మో)

చరణం: అమృతము సురలకు, అసురులకు జలమును
పంచె మోహిని, అంత అసురులను మరిపింప
అవతరించునులె ఆ దేవదేవుండు
జగములను గాపాడ దీనబాంధవుడూ (బ్రహ్మో)

భువినేలే

పల్లవి : భువినేలే నీ సుందరపదములు
అవియేమాపాలి పరమపదములు "2"

చరణం : శిష్టులపాలి ప్రియరక్షకుడవీవు
నిశాచరుపాలిట కర్కోటకుడవీవు "2"
హరినీవె ఆదిమధ్యాంత రహితుడవు
సమస్త రూపముల మూలరూపుడవు (భువి)

చరణం : రూపుదాల్చేవు గండర గండునిగ
దుండగులను పిండి జేసేటి వేళల "2"
బ్రోతువు సరిరాని కరుణాలవాలా
శరణుజొచ్చిన దీనులు నినుజేర (భువి)

సుధన్వా సంకీర్తనం వీడియోస్ యూ ట్యూబ్ ద్వారా వీక్షించండి

https://www.youtube.com/channel/UC9s2iiOB2nacBxXub3DGdQQ/videos?shelf_id=0&view=0&sort=dd



and many more....